# వర్కింగ్ జర్నలిస్ట్


## సమాచార స్రవంతి


సంపుటి: 14


సంచిక: 05

మే 2025

వెల: రూ. 5/-

విశాఖపట్నంలో జరిగిన ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ వెబ్‌సైట్‌ను ప్రారంభించినప్పటి దృశ్యం



శ్రీ సి.రాఘవాచారి మీడియా అకాడెమీ చైర్మన్‌గా నియమితులైన ఆలపాటి సురేష్



ఒంగోలులో మే 23వ తేదీ జరిగిన ప్రకాశం జిల్లా ఫెడరేషన్ మహాసభలకు హాజరైన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు









సాక్షి సంపాదకుడు ధనుంజయరెడ్డి
ఇంట్లో నోటీసులు ఇవ్వకుండా
పోలీసుల సోదాను నిరసిస్తూ
చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో
ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన
నిరసన దృశ్యాలు







ఒంగోలులో జరిగిన
ప్రకాశం జిల్లా
మహాసభల దృశ్యాలు



# వర్కింగ్ జర్నలిస్ట్ సమాచార స్రవంతి

**సంపుటి: 14 మే 2025 సంచిక: 5**


## లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| విమర్శలతో దిగివచ్చిన కేంద్రం .............. | 4 |
| మీడియా అకాడెమీ చైర్మన్‌గా సురేష్ ............ | 5 |
| పత్రికాస్వేచ్ఛ సూచీలో 151వ స్థానంలో భారత్ ............ | 6 |
| చిరస్మరణీయులు మే డే వీరులు ........................ | 7 |
| జూన్ 11 జర్నలిస్టుల డిమాండ్స్ డే ........... | 8 |
| జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్ళు.................. | 11 |
| ఈ టీవీ విలేకరికి ఫెడరేషన్ సన్మానం ...................... | 12 |
| అక్రిడిటేషన్ల జీవో తయారీకి మంత్రులతో కమిటీ .................. | 13 |
| జర్నలిస్టుల సంక్షేమానికి కృషి ---------------- | 14 |
| జర్నలిస్టులు ప్రధాన విధులు .................... | 17 |
| కావలిలో నలుగురు జర్నలిస్టుల అరెస్టు ....... | 18 |
| జైళ్ళ నుంచి జర్నలిస్టులను విడిచిపెట్టాలి ...... | 19 |



**సంపాదకులు**

**ఎ.అమరయ్య**

**వర్కింగ్ ఎడిటర్స్**

**ఎన్.కొండయ్య ఎం.ఎ.రవూఫ్**

**సంపాదకవర్గం**

| | |
|---|---|
| జి.ఆంజనేయులు | ఎస్.వెంకట్రావు |
| వి.నవీన్‌రాజ్ | ఎమ్. శ్రీనివాస్ |
| బి.ఎన్.ప్రసాదరావు | వి.గోపి |
| వి.రామారావు | ఆర్.రామాంజనేయులు |
| బి. ఈశ్వరరావు | కె.వేణుగోపాలరావు |
| టి.మద్దులేటి | వి.భక్తవత్సలం |
| ఒ.శాంతి | ఎస్.మురళీశంకర్ |
| కె.ఎస్.శంకరరావు | జి. శీనుబాబు |
| డి.మధుసూదనరావు | |

**డిజైనర్:**



**PUBLISHED, PRINTED AND EDITED BY**
**G. Anjaneyulu on behalf of**
**Andhra Pradesh Working**
**Journalists Federation**
H. No.1-7-9/A, Plot No.40, 402, Surabhi Sapphire, Golconda 'X' Roads, Musheerabad, Hyderabad-500 020, A.P.

**PRINTED AT**
**Prajashakthi,** M.B. Bhavan, Near RTC Cross Roads, Hyderabad-500 020.

**EDITOR**
**A.Amaraiah**
e-mail:editorworkingjournalist@gmail.com,
Cell: 9347921291
RNI No. APMUL/2009/37690


# బహుళత్వానికి ముప్పు

మే నెలలో జరిగిన పలు సంఘటనలు మీడియాకు సంబంధించి పునరాలోచన చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధంలో యుద్ధవార్తలు కవర్ చేసే యువ జర్నలిస్టు, ఉక్రెయిన్‌కు చెందిన విక్టోరియా రోస్చినాను రష్యా బలగాలు కిడ్నాప్ చేసి క్రూరంగా హింసించి చంపేశాయి. భారతదేశంలో పహెల్‌గాం సంఘటన అనంతరం భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా లభించిన తోడ్పాటు సోషల్ మీడియా ట్రోలింగ్‌లతో హరించుకుపోయింది. ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవ సూచీలో భారతదేశం 180 దేశాల్లో 151 స్థానంలో ఉన్నాం. గత యేడాదితో పోలిస్తే పరిస్థితి కొంచెం మెరుగైనప్పటికీ ప్రమాదకర పరిస్థితుల్లోనే ఉన్నాం. కార్పొరేట్ శక్తులు, రాజకీయ దిగ్గజాల కబంద హస్తాల్లో చిక్కిన మీడియా వల్ల బహుళత్వానికి ముప్పు వాటిల్లుతున్నదని రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ నివేదిక తెలియజేస్తోంది. ఆర్థిక ఒత్తిడులు మీడియా దేశంలో బలహీనపడేందుకు కారణంగా ఈ నివేదిక గుర్తించింది. కేరళకు చెందిన మక్తూబ్, కౌంటర్ కరెంట్స్ కోసం వ్యాసాలు రాస్తున్న రెజాబ్ అనే జర్నలిస్టును నాగపూర్ పోలీసులు అరెస్టు చేశారు. ఆయన ప్రధానంగా పోలీసుల అతిక్రమణలు, జైళ్లలో మానవహక్కుల ఉల్లంఘనలు తదితర అంశాలపై దృష్టి సారించి వ్యాసాలు రాస్తారు. సంచలనాత్మక కథనాలను ప్రసారం చేసే స్వతంత్ర మీడియా సంస్థ 'ది వైర్' వెబ్ పోర్టల్‌ను కేంద్ర ప్రభుత్వం బ్లాక్ చేసింది. సమాచార, సాంకేతిక అంశాలకు సంబంధించి ఐటి చట్టం–2000 కింద బ్లాక్ చేస్తున్నట్లు ఇంటర్నెట్ ప్రొవైడర్లు చెబుతున్నారు. ఇది మీడియా స్వేచ్ఛపై దాడిగా దేశంలోని జర్నలిస్టు సంఘాలు విమర్శించాయి. సర్వత్రా వ్యతిరేకత వ్యక్తం కావడంతో కేంద్రం వెనక్కు తగ్గింది. ఏది ఏమైనప్పటికీ దేశంలో అధికారంలో ఉన్న రాజకీయ పక్షాలకు అనుకూలంగా వ్యవహరించేవారు ఎలాంటి అవాకులు, చవాకులు పేలినా పట్టించుకోకుండా, విశ్వసనీయంగా పనిచేసే సంస్థలపై నిషేధాలు విధించడం పట్ల విమర్శ వెల్లువెత్తుతోంది. కర్ర ఉన్నవాడిదే బర్రె అనే సామెత చందంగా అధికారంలో ఉన్న కొన్ని రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయి. దేశంలో ప్రతిపక్షం అన్నా లేకున్నా ప్రజల పక్షం వహించి జరుగుతున్న మంచిచెడ్డలను ఎంచిచూసే మీడియాను తమ చెప్పుచేతల్లో పెట్టుకుని ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించాలని చేసే ప్రయత్నం తాత్కాలికంగా ఉపయోగపడ్డా అన్ని వేళలా చెల్లుబాటు కాదు. ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి సారించి, ప్రజా సంక్షేమం లక్ష్యంగా పనిచేసే క్రమంలో స్వేచ్ఛగా మీడియా పనిచేసేందుకు అనువైన పరిస్థితులను కల్పించడం ద్వారా మాత్రమే ప్రజల మన్ననలకు అందుకోగలరనే సత్యాన్ని గ్రహించాలి.

# కేరళ జర్నలిస్టు రెజాజ్ అరెస్టు

ఆపరేషన్ సిందూర్ – పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై భారతదేశం చేపట్టిన సైనిక దాడులను విమర్శిస్తూ సోషల్ మీడియా సందేశాన్ని పోస్ట్ చేసినందుకు కేరళకు చెందిన 26 ఏళ్ల జర్నలిస్టును నాగ్‌పూర్ పోలీసులు అరెస్టు చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లోని మానవ హక్కుల సమస్యలపై చురుకుగా నివేదికలు అందిస్తున్న జర్నలిస్ట్ రెజాజ్ ఎం. షీబా సిదీక్‌ను మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లోని ఒక హోటల్‌లో అరెస్టు చేశారు. రెజాజ్ నిషేధిత సిపిఐ (మావోయిస్ట్) సంస్థ సభ్యుడని మే 7న లకాడ్‌గంజ్ పోలీస్ స్టేషన్ ఎఫ్ఐఆర్‌లో ఆరోపించింది. స్థానిక మేజిస్ట్రేట్ కోర్టు అతన్ని మే 13 వరకు పోలీసు కస్టడీకి పంపింది. కేరళ విశ్వవిద్యాలయంలో సామాజిక సేవను అభ్యసించిన రెజాజ్, కేరళకు చెందిన వార్తా వేదిక మక్తూబ్, కౌంటర్ కరెంట్స్ కోసం రాస్తున్నారు. అతని వ్యాసాలు ప్రధానంగా పోలీసుల అతిక్రమణలు, జైళ్లలో మానవ హక్కుల ఉల్లంఘనలు, ఇతర అంశాలపై దృష్టి సారించాయి. గత 10 రోజుల్లో, రెజాజ్‌పై నమోదైన రెండవ ఎఫ్ఐఆర్ ఇది. ఏప్రిల్ 29న, కొచ్చిలో జరిగిన కాశ్మీర్ అనుకూల నిరసనలో పాల్గొన్నందుకు ఆయన మరికొందరు జర్నలిస్టులపై కేసు నమోదైంది. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడిలో పాల్గొన్నారని ఆరోపించబడిన వారి ఇళ్ల కూల్చివేతను హైలైట్ చేయడానికి ఈ నిరసన నిర్వహించారు.

# విమర్శలతో దిగొచ్చిన కేంద్రం

స్వతంత్ర మీడియా సంస్థ 'ది వైర్' వెబ్ పోర్టల్ ను కేంద్ర ప్రభుత్వం బ్లాక్ చేసింది. ఈ విషయాన్ని ద వైర్ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే దీనిపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తంకావడంతో కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. 'ద వైర్' వెబ్ పోర్టల్‌పై దిగ్బంధాన్ని తొలగించింది. అయినా పోర్టల్ ఓపెన్ కాలేదు. దీంతో కేంద్రం తీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇది కచ్చితంగా మీడియా స్వేచ్ఛను హరించివేయడమేనని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచార, సాంకేతిక అంశాలకు సంబంధించిన 'ఐటి చట్టం 2000' కింద 'ద వైర్'ను ప్రభుత్వం బ్లాక్ చేసినట్లు ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్, అనంతర పరిణామాల నేపథ్యంలో సరిహద్దులో ఉద్రిక్తతలు నెలకొన్న దరిమిలా మక్తూబ్ మీడియా, ది కాశ్మీరీ యూత్, ఫ్రీ ప్రెస్ కాశ్మీర్ వార్తా సంస్థల వెబ్‌సైట్లను, సామాజిక మాధ్యమాల్లోని వివిధ ఖాతాలను కేంద్ర ప్రభుత్వం బ్లాక్ చేసింది. ఈ క్రమంలోనే 'ది వైర్' వెబ్ పోర్టల్‌ను కూడా బ్లాక్ చేసింది. అయితే స్వతంత్ర మీడియాగా సంచలనాత్మక కథనాలు అందించిన 'ది వైర్' పోర్టల్‌ను బ్లాక్ చేయడం పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడిగా జర్నలిస్టుల సంఘాలు విమర్శించాయి. దేశంలో కీలకమైన సమయంలో ఇటువంటి చర్యలు హేతుబద్ధమైన ఆలోచనను అడ్డుకుంటాయని పేర్కొంది. యుద్ధం ఆవశ్యకత, భయానక పరిస్థితులను, స్వతంత్ర జర్నలిజాన్ని అణచివేసేందుకు సాకుగా వినియోగించలేమని ఆగ్రహం వ్యక్తం చేసింది.

**సిపిఎం ఖండన**

వైర్ వెబ్ పోర్టల్‌ను బ్లాక్ చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పత్రికా స్వేచ్ఛను అడ్డుకునే ఇటువంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొంది. ఆపరేషన్ సిందూర్‌పై నిరంతరాయంగా అసత్య వార్తలను ప్రచారం చేస్తున్న టివి చానల్స్‌ను ఎలాంటి హెచ్చరికలు లేకుండా అనుమతించడం, విశ్వసనీయమైన వైర్ వంటి వార్తా చానెల్స్‌ను బ్లాక్ చేయడం సిగ్గుచేటు అని పేర్కొంది.

## సాక్షి పత్రిక విలేఖరిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

అయినవిల్లి మండలం సాక్షి దినపత్రిక విలేఖరి రాముపై రాత్రి ఇంటికెళుతున్న సమయంలో శివతేజ స్కూల్ సమీపంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి, తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటనలో రాము తీవ్రంగా గాయపడి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాముపై దాడిని పి.గన్నవరం జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ డిమాండ్ చేశారు. మీడియా స్వేచ్ఛను కాపాడాలని.. మీడియా ప్రతినిధిపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.



# మీడియా అకాడమీ ఛైర్మన్‌గా సురేష్

శ్రీ రాఘవాచారి ఆంధ్ర ప్రదేశ్ మీడియా అకాడమీ ఛైర్మన్ గా సీనియర్ జర్నలిస్టు ఆలపాటి సురేష్ను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. ఈయన ఈ పదవిలో రెండు సంవత్సరాల పాటు కొనసాగుతారు. ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాలలో పనిచేసిన సురేష్ గత ప్రభుత్వ హయాంలో అమరావతికి సంబంధించి జరుగుతున్న సంఘటనలపై విధ్వంసం అనే ఒక పుస్తకం రచించారు. అమరావతి పోరాట సమితి తరపున సురేష్ కు ఈ పదవి వరించినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

## అరకులోయ ప్రెస్‌క్లబ్ ఎన్నిక



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో 20 మంది జర్నలిస్టులు ఫెడరేషన్‌లో చేరారు. అల్లూరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.డి.చక్రవర్తి, రహీం, కోశాధికారి సునీల్ లు వారిని ఫెడరేషన్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం అరకులోయ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షునిగా త్రినాద్, ప్రధాన కార్యదర్శిగా సింహాచలం, కోశాధికారిగా సింహాద్రి, ఉపాధ్యక్షులుగా రామన్న, శ్యామ్, సహాయ కార్యదర్శిగా నాయుడు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. 20 మందికి సభ్యత్వాలు ఇవ్వడం జరిగింది.

# స్థానిక సమస్యల పరిష్కారమే ఫెడరేషన్ లక్ష్యం

అరకు నియోజకవర్గ పరిధిలో 20 మంది పాత్రికేయులు ఫెడరేషన్‌లో చేరారు. అల్లూరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.డి.చక్రవర్తి, షేక్ రహీంతుల్లా, అరకులోయ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు త్రినాద్, డేవిడ్ ఆధ్వర్యంలో డుంబ్రిగుడ మండలం పాత్రికేయులను ఫెడరేషన్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం డుంబ్రిగుడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డుంబ్రిగుడ ప్రెస్ క్లబ్ కార్యవర్గం గౌరవ అధ్యక్షునిగా శెట్టి సంజీవరావు (వార్త), ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా శెట్టి మల్లేశ్వరరావు (విశాలాంధ్ర), ఉపాధ్యక్షునిగా జన్ని సింహాచలం (ఆంధ్రపత్రిక), ప్రధాన కార్యదర్శిగా మండ్యాగురు అర్జున్ (ఆంధ్రప్రభ), సహాయ కార్యదర్శిగా తుడుము శంకర్ (పెన్ పవర్), కోశాధికారిగా మజ్జి చక్రధర్(జ్యోతి), సహాయ కోశాధికారిగా మండ్యాగురు జగదీష్ (సూర్య), కార్యవర్గ సభ్యులుగా శెట్టి గెన్ను (ఉదయం), మండ్యాగురు రామ్ ప్రసాద్(పబ్లిక్), తుడుము సాంబ (ఆంధ్రన్యూస్), సమర్ధి కృష్ణ(ఆంధ్రపథం), మండ్యాగురు అప్పలరాజు(విజన్), మండ్యాగురు స్వామి (ప్రజాశక్తి), కంబిడి భాస్కరరావు (విశాఖటుడే)తో డుంబ్రిగుడ ప్రెస్ క్లబ్ ఏర్పాటు జరిగింది.



# పత్రికా స్వేచ్ఛ సూచీలో 151వ స్థానంలో భారత్

**మొదటి మూడు స్థానాల్లో నార్వే, ఎస్టోనియా, నెదర్లాండ్స్**
**రిపోర్టర్స్ విత్ఔట్ బోర్డర్స్ ర్యాంకింగ్స్**




ఆఫ్రికాలోని చాలా దేశాల్లో పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు ఉండేవి. వాటికి నిరసనగా ఆఫ్రికన్ జర్నలిస్టులు 1991, ఏప్రిల్ 29 నుండి మే 3వ తేదీవరకు ఆఫ్రికాలోని నమీబియా దేశపు విండ్ హాక్ నగరంలో సమావేశం ఏర్పాటుచేసి, పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన అనేక తీర్మానాలు చేశారు.

ఆఫ్రికన్ జర్నలిస్టుల నిరసనగా గుర్తుగా మే 3వ తేదీని ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవంగా జరపాలని 1993, డిసెంబరు నెలలో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం నిర్ణయించింది.

అప్పటినుంచి ప్రతి సంవత్సరం మే 3వ తేదీన ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవంను జరుపుకుంటున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న పత్రికా స్వేచ్ఛను అంచనా వేయడం, దానిని రక్షించడం. విధుల్లో ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టులకు నివాళి అర్పించడం అనేవి ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం లక్ష్యాలు

కొలంబియాలోని ఒక పత్రికకు ఎడిటర్‌గా పనిచేస్తున్న గుల్లెర్మోకేనో అనే వ్యక్తిని 1986 డిసెంబర్ 17న డ్రగ్ మాఫియా హత్య చేసింది. పత్రికా స్వేచ్ఛకు స్ఫూర్తిగా ఆయన పేరుమీద యునెస్కో 1997 నుంచి ప్రతి సంవత్సరం మే 3వ తేదీన గుల్లెర్మోకేనో ప్రపంచ పత్రికా స్వేచ్ఛ అవార్డులను ఇస్తుంది.

ఎన్ని అవరోధాలు, ఇబ్బందులు ఎదురైనాకానీ పత్రికా స్వేచ్ఛకు ప్రతీకగా నిలిచిన జర్నలిస్టులకు ఈ అవార్డుతో 25,000 అమెరికన్ డాలర్ల నగదు బహుమతిని అందజేస్తారు.

ప్రజాస్వామ్య దేశాలల్లో పత్రికలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రజాస్వామ్యానికి మూలస్తంభంగా నిలుస్తాయి. కానీ నేడు పత్రికా స్వేచ్ఛ ప్రమాదంలో పడింది. మీడియాపై నియంత్రణకు ప్రభుత్వాలు, ఉగ్రవాద సంస్థలు ఆంక్షలు విధిస్తున్నాయి. మీడియాపై దాడులకు తెగిస్తున్నాయి. పత్రికల గొంతు నొక్కేయడానికి ప్రయత్నిస్తున్నాయి. పాత్రికేయుల రహస్య మూలాల గుర్తింపు బహిర్గతం చేయాలని వారిని వేధిస్తున్నారు.

ఎప్పటిలాగే ఈ సారి కూడా ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచీలో భారత్ వెనకబడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా 180 దేశాలలో భారత్ 151వ స్థానంలో ఉన్నది. ఇది పొరుగు దేశాలైన నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్, మాల్దీవుల కంటే దిగువ స్థానంలో ఉండటం గమనార్హం. మీడియా వాచాగ్ రిపోర్టర్స్ సాన్స్ ఫ్రాంటియర్స్ ఈ విషయాన్ని తెలిపింది. రిపోర్టర్స్ విత్ఔట్ బోర్డర్స్ అని పిలవబడే ప్రభుత్వేతర సంస్థ 2002 నుంచి ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచికను ప్రచురిస్తోంది. రాజకీయ, ఆర్థిక, శాసన, సామాజిక భద్రత అనే ఐదు సూచికల ఆధారంగా ఆయా దేశాలలో పత్రికా స్వేచ్ఛను అంచనా వేస్తోంది. దీని ప్రకారం.. 2024లో భారత ర్యాంకు 159గా, 2023లో 161గా ఉన్నది. ఈ సారి ర్యాంకు కాస్త మెరుగుపడినా.. అది ఆశించినంత స్థాయి కాదనేది విశ్లేషకుల అభిప్రాయం. పత్రికా స్వేచ్ఛా సూచీలో భారత ప్రదర్శన 'చాలా తీవ్రమైన' వర్గంలోనే ఉన్నదని రిపోర్టర్స్ విత్ఔట్ బోర్డర్స్ వివరించింది. రాజకీయ దిగ్గజాల చేతుల్లో మీడియా యాజమాన్యం కేంద్రీకృతమై ఉన్న కారణంగా మీడియా బహుళత్వానికి ముప్పు వాటిల్లుతున్న దేశాల జాబితాలో భారత్ కూడా ఉన్నది. అలాగే, ప్రపంచ పత్రికా స్వేచ్ఛ స్థితిని మొదటిసారిగా క్లిష్ట పరిస్థితిలో ఉన్నట్టు సూచిక వర్గీకరించింది. ఆర్థిక ఒత్తిడే మీడియా బలహీనపడటానికి దోహదపడే ప్రధాన అంశమని సదరు సంస్థ వివరించింది.

భారత్ పొరుగున ఉన్న దేశాలు పత్రికా స్వేచ్ఛలో మనకంటే మంచి స్థానాల్లోనే ఉండటం గమనార్హం. నేపాల్ (90వ స్థానం), మాల్దీవులు (104), శ్రీలంక (139), బంగ్లాదేశ్ (149)ల కంటే భారత్ దిగువ

స్థానంలో ఉన్నది. భూటాన్ (152). పాకిస్తాన్(158), మయన్మార్ (169), ఆఫ్ఘనిస్తాన్ (175)లు భారత్ కంటే వెనుకబడి ఉన్నాయి. ఇక నార్వే, ఎస్టోనియా, నెదర్లాండ్స్ దేశాలు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఆర్థిక స్వాతంత్ర్యం లేకుండా స్వేచ్ఛా పత్రికా వ్యవస్థ లేదని లేదని రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ ఎడిటోరియల్ డైరెక్టర్ అన్నే బోకాండే అన్నారు. వార్తా మాధ్యమాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు నాణ్యమైన నివేదికలను ఫణంగా పెట్టి ప్రేక్షకులను ఆకర్షించే పోటీలోకి దిగుతాయనీ, వారిని దోపిడీ చేయటానికి ప్రయత్నించే సామ్రాజ్యవాదులు, ప్రభుత్వ అధికారులకు బలైపోవచ్చుని బోకాండే చెప్పారు.

అనధికారిక అత్యవసర పరిస్థితిలో భారత మీడియా

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పత్రికా స్వేచ్ఛ ప్రమాదంలో పడిపోయిందన్నది విశ్లేషకుల అభిప్రాయం. రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ కూడా ఇదే అభిప్రాయాన్ని తెలిపింది. 2014లో ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశ మీడియా 'అనధికారిక అత్యవసర పరిస్థితి'లోకి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. బీజేపీ, మీడియాలో ఆధిపత్యం చెలాయించే పెద్ద కుటుంబాల మధ్య అద్భుతమైన నయోధ్యను రూపొందించిందని భారత్‌పై తన విభాగంలో వివరించటం గమనార్హం.

అంబానీ, అదానీ రాక, ప్రధాన స్రవంతి మీడియా బహుళత్వానికి ముగింపు

భారత్‌కు చెందిన సంపన్న పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ 70కి పైగా మీడియా సంస్థలను కలిగి ఉన్నాడనీ, వాటిని కనీసం 80 కోట్ల మంది భారతీయులు అనుసరిస్తున్నారని రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ సంస్థ నివేదిక పేర్కొన్నది. అంబానీని ప్రధాని మోడీకి మోడీకి 'సన్నిహిత స్నేహితుడు'గా అభివర్ణించింది.

ఇక భారత్‌లోని ప్రముఖ ఆంగ్ల వార్తా ఛానెల్ ఎన్డీటీవీని, ఆదానీ చేజిక్కించుకున్న విషయాన్నీ ఇది. ప్రస్తావించింది. 2022లో ఆదానీ గ్రూపు ఎన్డీటీవీని కొనుగోలు చేయటం ప్రధాన స్రవంతి మీడియాలో బహుళత్వానికి ముగింపు'ని సూచిస్తుందని వివరించింది. ఆదానీ కూడా మోడీకి సన్నిహితుడిగా పరిగణించబడుతున్నాడని పేర్కొన్నది.

'గోడీ మీడియా' సంస్థల పెరుగుదల ఇక 'గోడీ మీడియా'గా పిలవబడే బీజేపీ. అనుకూల ప్రచారాన్ని చేసే మీడియా సంస్థలూ పెరిగాయని రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ పేర్కొన్నది. మీడియా విషయంలో ప్రధాని మోడీ తీరునూ వివరించింది. ''ప్రధాని పత్రికా సమావేశాలు నిర్వహించరు. తనకు అనుకూలంగా ఉండే. జర్నలిస్టులకు మాత్రమే ఇంటర్వ్యూలు ఇస్తారు. విధేయత చూపని వారిని తీవ్రంగా విమర్శిస్తారు. అని నివేదిక పేర్కొన్నది. ఇక మోడీ సర్కారును విమర్శించే భారతీయ జర్నలిస్టులు బీజేపీ అనుకూల వర్గాల ట్రోల్స్ ద్వారా వేధింపులను ఎదుర్కొన్నారని కూడా నివేదిక వివరించటం గమనార్హం.

# చిరస్మరణీయులు మే డే వీరులు!

పార్సన్స్, ఫషర్, ఎంగెల్, స్పైస్ అనే నలుగురి పేర్లు శ్రామికోద్యమ చరిత్రలో చిరస్మరణీయులు! వీరే మేడే పోరాటానికి నాయకత్వం వహించి ఉరికంబానికి వేలాడిన శ్రామికోద్యమ యోధులు!

"ఎనిమిది గంటల పని దినం కోసం కార్మికవర్గ పోరాటానికి నాయకత్వం వహించడం పొరపాటని ప్రకటిస్తే మీకు ప్రాణబిక్ష పెడతాం" అంటూ జడ్జి వారు బ్రతకడానికి ఓ అవకాశం కల్పించాడు.

వారిచ్చిన జవాబు ఇది.

"పెట్టుబడిదారీ వర్గంతో పశువుల కంటే హీనంగా దిగజార్చబడ్డ కోట్లాది కార్మికుల్ని మనుషులుగా గుర్తించాలని సాగించిన పోరాటానికి నాయకత్వం వహించినందుకు మేం గర్విస్తున్నాం. ఈరోజు మా ప్రాణాల రక్షణ కోసం ప్రాణబిక్ష కోరుకుంటే, భవిష్యత్తు చరిత్రలో కార్మిక నాయకత్వాల్ని కార్మికవర్గం నమ్మదు. ఆ శ్రామికవర్గం నిరాశతో నిరాయుధమై పశువుల్లా పని చేసే అవకాశాన్ని పెట్టుబడిదారీ వర్గానికి ఇచ్చిన వాళ్ళమౌతాం. ఆలా చరిత్ర హీనులుగా మిగలదల్చుకోలేదు. మమ్మల్ని ఉరితీయండి. మా అమర స్మృతిలో భూమండల శ్రామికవర్గం దాస్య శృంఖలాల నుండి విముక్తి కోసం పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తుంది. ఓ రోజు సోషలిజం కల ఫలిస్తుంది."

శ్రామికవర్గానికి నేటికీ సోషలిజం ఓ ఆశయంగా ఉండగానే ఆచరణలో ఏదో మేరకు ఇంతకాలం అమలు జరిగిన ఎనిమిది గంటల పనిదినాన్ని సైతం హరించడానికి ప్రపంచ పెట్టుబడిదారీ వర్గం నేడు ప్రయత్నాలు చేస్తోన్నది. ఈ సమయంలో తమ ప్రాణాల కంటే శ్రామికవర్గ విప్లవాశయాలు వేల రెట్లు ఉన్నతమైనవంటూ జడ్జి ఎదుట ప్రాణబిక్షను తిరస్కరించిన మేడే వీర యోధుల్ని స్మరించుకొని విప్లవ దీక్ష వహిద్దాం.



# జూన్ 11 జర్నలిస్టుల డిమాండ్స్ డే

ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 11వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల డిమాండ్స్ డే పాటించాలని ఫెడరేషన్ పిలుపిచ్చింది. రాష్ట్ర రాజధాని నుంచి మండల కేంద్రం వరకు అన్ని స్థాయిలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రాలు అందజేయాలని కార్యవర్గం కోరింది. జూన్ 9న జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టుల చట్టాల రద్దును నిరసిస్తూ ఆందోళన చేయాలని పిలుపిచ్చింది. కార్మిక చట్టాల రద్దుపై జాతీయ కార్మిక సంఘాలు చేపట్టే అన్ని రకాల ఆందోళన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఫెడరేషన్ నిర్ణయించింది. దేశ వ్యాప్తంగా జర్నలిస్టులకు సంబంధించిన రెండు కీలక చట్టాలను కేంద్రం రద్దు చేయడం పట్ల నిరసిస్తూ జూన్ 9న రాష్ట్రవ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టుల ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్..వెంకటరావు ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు ప్రకటించారు.

## విశాఖలో రాష్ట్రకార్యవర్గం సమావేశం నిర్ణయం

విశాఖపట్నంలో మే 29న ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్లాటినం జూబ్లీ హాల్‌లో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీరు మాట్లాడుతూ కేంద్రం తాజాగా 44 కార్మిక చట్టాలను రద్దు చేసిందని అందులో రెండు జర్నలిస్టులకు సంబంధించినవి ఉన్నాయన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1955, వేతనాల చెల్లింపులు చట్టం 1958 రద్దు చేసిన వాటిలో ఉన్నాయన్నారు.. వీటిని తక్షణమే పునరుద్ధరించాలని కోరారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో దశలవారీగా ఆందోళన తప్పదని రాష్ట్ర అధ్యక్షులు ఎస్. వెంకటరావు, జి. ఆంజనేయులు పేర్కొన్నారు.. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్న నేటికి అక్రిడేషన్లు కొత్తవి మంజూరు చేయలేదన్నారు. అలాగే ప్రభుత్వాలు మారినప్పటికీ జర్నలిస్టులు ఇళ్ల స్థలాలకు సైతం నోచుకోలేదన్నారు. దేశంలోని 14రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పెన్షన్ పథకం అమలు చేయాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని,. ప్రమాద బీమా పునరుద్ధరించాలని ఇలా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నట్లు వీరు చెప్పారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చేసిన తీర్మానాలను త్వరలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లకు నివేదిస్తామన్నారు. జర్నలిస్టులపై దాడులు నిరోధానికి ప్రత్యేక చట్టం చేయాలని అలాగే జర్నలిస్టులకు పత్రిక స్వేచ్ఛ కల్పించాలని తీర్మానాలు చేసారు. ఈ సమావేశంలో వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్‌కు



సంబందించిన నూతన వెబ్ సైట్‌ను నేషనల్ అలయెన్స్ అఫ్ జర్నలిస్టు సెక్రటరీ జనరల్ ఎన్.కొండయ్య ఆవిష్కరించారు. సమావేశంలో విశాఖ వేదికగా త్వరలో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు నిర్ణయించారు. ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం వివిధ అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నది. సమావేశ ప్రారంభంలో గత కార్యవర్గ సమావేశం నుంచి మే 29 వరకు మరణించిన జర్నలిస్టులకు సంతాపం ప్రకటించి రెండు నిముషాలు మౌనం పాటించింది. ఈ సమావేశంలో ఎన్ ఎ జే సెక్రటరీ జనరల్ ఎం కొండయ్య..జెండర్ ఈక్విటీ కౌన్సిల్ చైర్ పర్సన్ కె.మంజరి తదితరులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల నంచి వచ్చిన ఫెడరేషన్ నాయకులు చర్చల్లో భాగస్వాములయ్యారు. సమావేశ ప్రారంభంలో విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ్ స్వాగతం పలికారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీను బాబు, ఎపిబిజెఎ జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వర్ రావు, కార్యదర్శి కె. మదన్, చిన్న మధ్య తరహా పత్రికల సంఘం జిల్లా అధ్యక్షులు జగన్ మోహన్, కె. శ్రీనివాస్ రావులు రాష్ట్ర కార్యవర్గ సమావేశ ఏర్పాట్లను పర్యవేక్షించారు. విశాఖ జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసరావు వందన సమర్పణ చేశారు



# కుప్పకూలుతున్న భారత ఖ్యాతి

మన సైన్యం సాంకేతిక వీరత్వం, వ్యూహాత్మక విజయాలు ఎలా ఉన్నప్పటికీ, భారతదేశ అంతర్జాతీయ ఖ్యాతి కుప్పకూలింది. నిర్లక్ష్యపూరితమైన మీడియా సంచలనాత్మకత, దౌత్యపరమైన అతిక్రమణ, మిత్రదేశాలను దూరం చేసే మతపరమైన ద్వేషపూరిత ప్రసంగపు అపరిమిత విస్తరణే దీనికి కారణం.

భారతదేశం, పాకిస్తాన్ కోల్పోయిన 'వనరుల' సంఖ్యపై ఎక్కువ శ్రద్ధ చూపడానికి మించి, పాకిస్తాన్‌కు మనం గణనీయమైన నష్టాలను కలిగించామని ఇప్పుడు స్పష్టమైంది.

అలా చేయడం ద్వారా భవిష్యత్తులో జరిగే ఏ ఉగ్రవాద దాడులకైనా సరే, పాక్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉందంటూ ప్రధానమంత్రి ప్రకటించిన సంకల్పాన్ని అమలు చేయడానికి మన రక్షణ దళాలు సాంకేతిక, వైమానిక శక్తిని కూడా ప్రదర్శించాయి. ఉగ్రవాదంపై పోరాటంలో భారతదేశానికి ప్రపంచవ్యాప్త మద్దతు ఎందుకు లేదు? పహల్గాం తర్వాత భారత్‌పై విస్తృతంగా పెరిగిన సానుభూతి ఇంత త్వరగా ఎందుకు తగ్గిపోయింది? చైనా, టర్కీ అవకాశవాదంతో వ్యవహరిస్తోందని భావిస్తున్నాయని ఆయన గ్రహించలేకపోవడం. ఇవన్నీ అంతర్జాతీయ సమాజం మన రాజకీయాలను, విధానాలను అనుమానించడానికి, మన నుండి సహేతుక దూరం జరగడానికీ దారితీశాయి. పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధం భారతదేశానికి మన పొరుగు ప్రాంతంలో కూడా మిత్రదేశాలు లేవని చూపించింది. మన సైనికులు ఒంటరిగా పోరాడారు.

మన ఖ్యాతి, మన అంతర్జాతీయ ప్రతిష్టకు చెందిన చివరి మేకును మితవాద సైబర్ యోధులు, అపఖ్యాతి పాలైన 'ఐటీ సెల్' దిగగొట్టి వేశాయి. తప్పుడు సమాచారం పక్కన పెడితే, కశ్మీరీలు, వారి సమాజంపై ద్వేషాన్ని రేకెత్తించే పోస్టులతో సోషల్ మీడియా నిండిపోయింది. దీని ఫలితంగా కొన్ని రాష్ట్రాల్లోని హాస్టళ్లు, కళాశాలల నుండి కశ్మీరీ విద్యార్థులను వెళ్లగొట్టేశారు. ముస్లింల జాతి ప్రక్షాళన, పాకిస్తాన్ నిర్మూలన కోసం డిమాండ్లు వచ్చాయి. మధ్యప్రదేశ్‌లోని ఒక బీజేపీ మంత్రి కల్నల్ సోఫియా ఖురేషిని ఉగ్రవాదుల సోదరిగా ముద్ర వేశారు. హైకోర్టు స్వయంగా జోక్యం చేసుకుని అతనిపై కేసు నమోదు చేయాలని ఆదేశించే వరకు రాష్ట్రం అతనిపై ఎటువంటి చర్యా తీసుకోలేదు. అంతేకాకుండా, ఆయన ప్రాతినిధ్యం వహించే పార్టీ ఇంకా అతనిపై ఎటువంటి చర్యా తీసుకోలేదు.

కాల్పుల విరమణ ప్రకటించినందుకు విదేశాంగ కార్యదర్శిని, అతని కుమార్తెను మితవాద సానుభూతిపరులు నిర్దాక్షిణ్యంగా ట్రోల్ చేశారు. దీంతో ఆ అధికారి తన ఎక్స్ ఖాతాను లాక్ చేసుకోవాల్సి వచ్చింది. పహల్గాంలో ఉగ్రవాదులచే చంపబడిన నావికాదళ అధికారి భార్య హిమాన్షి నర్వాల్‌ను కూడా విడిచిపెట్టనంతగా వీరి వక్రీకరణ పరాకాష్టకు చేరుకుంది. మితవాద మతతత్వవాదులు ఆమెను కనికరం లేకుండా ట్రోల్ చేశారు, ఆమెపై విషం చిమ్మారు. ఆమెను కాల్చి చంపాలని కోరుకున్నారు. ఆమె వ్యక్తిత్వం, నైతికతపై సందేహాలు వ్యక్తం చేశారు. ఎందుకు? ఎందుకంటే ఆమె మత సామరస్యం కోసం, ముస్లింలు-కశ్మీరీలపై జరుగుతున్న హింసను ఆపమని విజ్ఞప్తి చేశారు. మన సైనికులు అలాంటి వక్రబుద్ధిపరుల కోసం పోరాడారా? ప్రపంచం, అంతర్జాతీయ మీడియా దీనిని గమనించి భారతదేశం నుంచి దూరం కావాలని నిర్ణయించుకున్నాయి. ఉగ్రవాదానికి సంబంధించిన బలమైన ఆరోపణలను కలిగివున్న మనం, సంఘర్షణకు మూల కారణమైన ఉగ్రవాదంపై పోరు వెనుక పట్టు పట్టడానికి అనుమతించాము. హిందూ భారతదేశం వర్సెస్ ఇస్లామిక్ పాకిస్తాన్ కథనం కేంద్ర వేదికను ఆక్రమించింది. మనం ఆశించే మద్దతుతో పాటు వేదికను కూడా కోల్పోయాం.

దౌత్యపరంగా, అవగాహన పరంగా యుద్ధభూమిలోనూ ఆకాశంలోనూ మన ప్రయోజనాలను మనమే పోగొట్టుకున్నాము, మన వీరోచితమైన, అహంకారపూరిత వాక్చాతుర్యంతో మనం ఒంటరితనపు పెట్టెలో చిక్కుకున్నాము. మనకు ఎవరి తోడూ లేకుండా పోయింది. ఎందుకంటే మీ పాదాలు కిరాయి అవకాశవాదం, ప్రాథమిక మానవ హక్కుల పట్ల ధిక్కారం, ద్వేషం, మత జాతీయవాదపు చిత్తడినేలలో గట్టిగా పాతుకుని ఉన్నప్పుడు మీరు నైతికపరమైన ఉన్నత స్థానాన్ని ఆక్రమించలేరు. దీని కోసం మన సైనికులు పోరాడలేదు. సైనికులు గెలిచారు కానీ ఒకదేశంగా మనం వారికి తలవంపులు తీసుకొచ్చాం.

అనువాదం: **ప్రత్యూష**

**(వ్యాస రచయిత మాజీ ఐఏఎస్ అధికారి అవయ్ శుక్లా రాసిన ఈ వ్యాసం మొదట తన బ్లాగ్ 'వ్యూ ఫ్రమ్ (గ్రేటర్) కైలాష్'లో ప్రచురితమైంది.)**

# అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలైన జర్నలిస్టులకు అలాగే వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని తెలిపారు.

వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలసరి పెన్షన్, తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు నాంపల్లి లోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండల, నియోజకవర్గ స్థాయిలో పని చేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మంచిని మంచిగా, నిజాన్ని నిర్భయంగా సమాజనికి తెలియజేసే దాంట్లో ఎంతో మంది జర్నలిస్టులు ఆణిముత్యాలుగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. జర్నలిస్టు వృత్తిని నమ్ముకుని తన జీవితం మొత్తం ఆ వృత్తికే అంకితం అయినవాళ్ళు ఎంతోమంది ఉన్నారని అన్నారు. ఆనాటి ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనాన్ని చిన్న చిన్న మరమత్తులు పూర్తి చేసుకుని ఈ నెల చివరిలోగా ప్రారంభిస్తామని తెలిపారు.

విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 42 కోట్లను ఫిక్సడ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమి ఖర్చు పెడుతుందని. జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్ డిపాజిట్ పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు 22 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు.

మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి లక్ష రూపాయలతో పాటు అయిదు సంవత్సరాల వరకు నెలకు 3000 రూపాయల చొప్పున పెన్షన్, వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల క్రింద 1 నుండి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు నెలకు వెయ్యిరూపాయల చొప్పున గరిష్టంగా ఇద్దరికి అందించడం జరుగుతుంది. ఇప్పటి వరకు ఈ ఖాతాలో మొత్తం 8,98,39,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు.

ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి మాట్లాడుతూ ఈ సమాజంలో జర్నలిస్టు వృత్తి అత్యంత కీలకమైనదని తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్నారని గడిచిన రెండు రోజులుగా రెండు దేశాల మధ్య ఏం జరుగుతుందో అన్న ఆతృతతో ఎదురుచూస్తున్న ప్రజలకు తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నారని కొనియాడారు.

ప్రెస్ అకాడమీ ఛైర్మన్ మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.




# చిత్తూరులో ఫెడరేషన్ పతాకావిష్కరణ

మే దినోత్సవం సందర్భంగా చిత్తూరులో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఫెడరేషన్ పతాకాన్ని కార్యాలయం పైన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లాకు చెందిన ఫెడరేషన్ నాయకులు, ఎపిబిజెఎ నాయకులు పాల్గొన్నారు. జిల్లాలోని జర్నలిస్టులకు మేడే శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఈటీవీ రిపోర్టర్ లక్ష్మి ప్రసాద్‌కు ఫెడరేషన్ సన్మానం

వ్యవసాయం, జీవవైవిధ్యం సంబంధించి లోతైన విశ్లేషణలతో ఈటీవీ లో కథనాలు ఇచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా ఈటీవీ సీనియర్ చీఫ్ రిపోర్టర్ లక్ష్మీ ప్రసాద్‌ను అనంతపురం జిల్లాలోని బ్రాడ్‌కాస్ట్ మీడియా జర్నలిస్టులు సత్కరించారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి రేపటి రామాంజనేయులుతో పాటు వివిధ పత్రికలు, టీవీ చానళ్లకు చెందిన జర్నలిస్టులు పాల్గొని లక్ష్మీప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు.

# జర్నలిస్టుల సమస్యలపై పోరాడాలి

జర్నలిస్టుల సమస్యలపై పోరాడి పరిష్కరించాల్సిన బాధ్యత ఫెడరేషన్ నాయకులదేనని ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భక్తవత్సలం అన్నారు. దర్శి లోని ఆర్ అండ్ బి బంగ్లాలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఎస్వీ బ్రహ్మం అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గొట్టిపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలపై పోరాడి పరిష్కరించింది ఏపీడబ్ల్యూజేఎఫ్ అని అన్నారు. నియోజకవర్గంలో గతంలో ఫెడరేషన్ పోరాట ఫలితమే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వచ్చాయన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు అందించేందుకు ఫెడరేషన్ కృషి చేస్తుందని అందులో భాగంగా అధికారులు, నాయకులతో ఇప్పటికే మాట్లాడడం జరిగిందన్నారు. ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్ వి బ్రహ్మం మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధనకై ఫెడరేషన్ నిరంతరం పోరాడుతుందన్నారు. విలేకరులుగా పనిచేస్తున్న అందరికీ అక్రిడిటేషన్లు వచ్చే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడటం జరిగిందన్నారు. అనంతరం దర్శి నియోజకవర్గ ఫెడరేషన్ నూతన కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా రాగిపిండి రామకోటిరెడ్డి, అధ్యక్షులుగా కేవీ పిచ్చయ్య, ఉపాధ్యక్షులుగా కొర్రపాటి హరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రభ బ్యూరో చీఫ్ షేక్ కరీముల్లా, పి9 ఎండి పోలినేని కిరణ్ జర్నలిస్టులు పాల్గొన్నారు.





# జర్నలిస్టుల అక్రిడిటేషన్ల జీవో తయారీకి మంత్రులతో కమిటీ

జర్నలిస్టులకు ప్రతి రెండేళ్ల కొకసారి ప్రభుత్వం అక్రిడిటేషన్లను మంజూరు చేస్తుంది. గతంలో ఈ అక్రిడిటేషన్లు జర్నలిస్టుల గుర్తింపునకు ఉపయోగపడేవి. కాలక్రమంలో జర్నలిస్టులకు అందజేసే అన్ని రకాల పథకాలకు అంటే ఆరోగ్య బీమా, సమగ్ర బీమా, ఇళ్లస్థలాల మంజూరు తదితర అంశాలన్నింటికీ వీటిని పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఫలితంగా రాష్ట్రం విడిపోయినప్పటి నుంచి అక్రిడిటేషన్ల జారీ వ్యవహారం సక్రమంగా జరగడం లేదు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పొడిగింపు తప్పడం లేదు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం 2024 నవంబరులో సచివాలయంలో జర్నలిస్టు సంఘాలు, సీనియర్ జర్నలిస్టులతో కూడిన సమావేశం ఏర్పాటుచేసింది. జర్నలిస్టుల పట్ల ఉదారంగా వ్యవహరించడం తమ విధానంగా ఉంటుందని సమాచార శాఖ మంత్రి, సమాచార శాఖ డైరెక్టర్ స్వయంగా సమావేశంలో స్పష్టమైన హామీలిచ్చారు. ఈ యేడాది సగం గడిచిపోయినా అక్రిడిటేషన్ల పొడిగింపు కొనసాగుతూనే ఉంది. ఎట్టకేలకు కొత్త జీవో రూపకల్పనకు కమిటీని వేశారు.

జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇచ్చేందుకు అవసరమైన జీవోను రూపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముగ్గురు మంత్రులతో ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. మంత్రుల కమిటీలో సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌లు ఉన్నారు. ఈ కమిటీకి సహాయ బృందంగా సమాచార శాఖకు చెందిన ఉన్నతస్థాయి అధికారులను నియమించారు. ఆ కమిటీ దిగువ పేర్కొన్న అంశాలపై కూలంకషంగా పరిశీలన చేసి అక్రిడిటేషన్ల జారీకి అవసరమైన నియమనిబంధనలను తయారుచేస్తుంది. వారిచ్చిన నివేదిక ఆధారంగా జీవో రూపుదిద్దుకుంటుంది.

జర్నలిస్టుల అక్రిడిటేషన్లకు సంబంధించి మంత్రుల సబ్ కమిటీకి ఈదిగువ పేర్కొన్న అంశాలను పరిశీలించి నివేదిక సమర్పిస్తే వారి సిఫార్సుల ఆధారంగా అక్రిడిటేషన్ జీవో రూపొందుతుంది . ఆతర్వాత మాత్రమే అక్రిడిటేషన్లు వచ్చే అవకాశం ఉంటుంది.

1.ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్, డిజిటల్ మీడియా పరిస్థితి మంత్రుల సబ్ కమిటీ పరిశీలన అంశాలు, మీడియా అక్రిడిటేషన్ రూల్స్ 2025కి సంబంధించి పరీక్షించుట

2. భారత ప్రభుత్వం జారీచేసిన మార్గ దర్శకాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల లోతైన అధ్యయనం. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని అక్రిడిటేషన్ నిబంధనలను కూడా కలిపి చూడాలి.

3. మీడియాలో అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ల సదుపాయం కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించడం.

4. మీడియా వేదికలపై కొత్తగా రూపాంతరం చెందిన డిజిటల్ మీడియాను దృష్టిలో పెట్టుకుని అక్రిడిటేషన్ నిబంధనలను సమీక్షించాలి.

5.డిజిటల్ ,సోషల్ మీడియాల్లోని ప్రముఖ వార్తా పోర్టల్లో యూట్యూబ్ ఛానళ్ళలో పని చేస్తున్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్ మంజూరుకుగల అవకాశాలను పరిశీలించాలి.

6. సమగ్రమైన మీడియా అక్రిడిటేషన్ రూల్సును రూపొందించేందుకు ఈదిగువ సూచించిన అంశాలను పరిగణనలో ఉంచుకోవాలి

రాష్ట్ర స్థాయి మీడియా అక్రిడిటేషన్ కమిటీ, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటి పొందిక, కాలపరిమితి, రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి కమిటీలలో పాతినిధ్యం వహించే రిజిష్టర్డ్ యూనియన్లు, అసోసియేషన్ల పరిస్థితులు, వార్త పత్రికలు, పిరియాడికల్స్, న్యూస్ ఏజెన్సీలు, ఫోటో ఏజెన్సీలు, శాటిలైట్ న్యూస్ ఛానళ్ళు, వార్త ప్రసారం చేసే కేబుల్ టీవీ ఛానళ్ళకు అక్రిడిటేషన్ మంజూరుకు గల అర్హతలు, ప్రతికా ప్రతినిధులు, ఫ్రీలాన్స్ జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు, కార్టునిస్టులు, ఎలక్ట్రానిక్ మీడియా, అధికార మీడియా ప్రతినిధుల అర్హతలు, సర్క్యులేషన్ ఆధారంగా దినపత్రికలు, పీరియాడికల్స్, శాటిలైట్ న్యూస్ ఛానళ్ళకు కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్ళకు రాష్ట్రంలో వారికున్న కనెక్టివిటీ, వ్యూయర్ షిప్ అర్హతలు,

7.మంత్రుల సబ్ కమిటీ వీలైనంత త్వరగా తమ ప్రతిపాదనలను పంపాలి.

కమిటీ కార్యకలాపాలను సమన్వయం చేయడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (పొలిటికల్), జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, మంత్రుల బృందానికి కన్వీనర్‌గా ఉంటారు. కమిషనర్/డైరెక్టర్ (సమాచార శాఖ) మంత్రుల బృందానికి సహాయం చేస్తూ అవసరమైన తదుపరి చర్యలు తీసుకుంటారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి




ప్రకాశం జిల్లాలోని జర్నలిస్టుల సంక్షేమం, భద్రత కోసం ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వాస్తవాలకు ప్రతిబింబంగా కథనాలు రాయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ఒంగోలు ఎమ్మెస్ ఫంక్షన్ హాల్లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా మహాసభ అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ఏపీ డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా అధ్యక్షులు గొట్టిపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ రాజ్యాంగం ఏర్పాటు చేసిన నాలుగో స్తంభం మీడియా అని ప్రభుత్వం చేస్తున్న లోపాలు ఎత్తి చూపడంలో జర్నలిస్టులకు సాటి లేదన్నారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు స్థానిక ఎమ్మెల్యేలు సహాయ సహకారాలు అందిస్తున్నారు. జర్నలిస్టులను అన్ని విధాల ఆదుకునేందుకు కృషి చేస్తామని జిల్లా కొత్త కమిటీకి అభినందనలు తెలియజేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ విలువలతో కూడిన వృత్తిని పాటించే వారిలో జర్నలిస్టులు ముందు వరుసలో ఉంటారన్నారు. ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపటం సరైనదే కానీ ఇష్టా రీతిలో వార్తలు రాయడం మానుకోవాలి అన్నారు. అర్హులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు తాను ముందు ఉంటానన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలపై వార్తలు రాసే క్రమంలో ప్రజాప్రతినిధులను సంప్రదించాలని తాము స్పందించకపోతే కథనాలు రాయవచ్చని అన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు వారధిగా జర్నలిస్టులు ఉన్నారని అటువంటి వారి సంక్షేమానికి తాము కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలోని జర్నలిస్టుల సంక్షేమానికి పాటు పడతామన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ






విలువలతో కూడిన జర్నలిజం సమాజానికి అవసరమని, కొందరు జర్నలిస్టులు రాసే కథనాలు ఇబ్బందికరంగా ఉంటున్నాయి అన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా మీడియాకు ఉన్న హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భవిష్యత్తులో జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తాను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటం జరుగుతున్న తీరును ఆనాటి పత్రికలు ప్రజలకు ప్రజలకు తెలియజేసి ఉత్తేజాన్ని రేకెత్తించాయన్నారు. మంచి పనులను ప్రోత్సహిస్తే మరిన్ని చేయడానికి అవకాశం ఉందని ఆ దిశగా జర్నలిస్టులు ఆలోచించాలన్నారు. దర్శి నియోజకవర్గ ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ సమాజాన్ని ప్రభావితం చేసేది జర్నలిస్టులని నీతి నిజాయితీతో వారు వ్యవహరిస్తారు అన్నారు. జనం నాడి తెలిసిన వారని, అక్రమాలు వెలికి తీస్తారు అన్నారు. జర్నలిస్టులకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎలాంటి వైద్య సదుపాయాలు అవసరమైన తనను సంప్రదించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్కె మాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అవినీతి అక్రమాలను జర్నలిస్టులు వెలికి తీస్తారని అటువంటి వారు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అవినీతిని ప్రశ్నించే జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో ఏపీడబ్ల్యుజె ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు జిల్లా కార్యదర్శి ఎస్పీ బ్రహ్మం ప్రసంగించారు. తరువాత సీనియర్ పాత్రికేయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ చైర్మన్ షేక్ రియాజ్ జనసేన పార్టీ నాయకులు కంది రవిశంకర్, ఏపీ కమ్మ సేవా ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షులు మండవ మురళీకృష్ణ, సీనియర్ పాత్రికేయులు నాతాని బ్రహ్మానందం, కోలా హరిబాబు, ఆర్ రామకృష్ణ, పొన్నూరు వెంకట శ్రీనివాసులు, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు సుధాకర్, మాజీ అధ్యక్షులు సిహెచ్ కాశీ విశ్వనాథ్, ఆర్ రాజశేఖర్ రాష్ట్ర కార్యదర్శి వి. భక్తవత్సలం, షేక్ చిన్న కరీముల్లా, దాసరి సునీల్, టీవీ9 స్టాఫ్ రిపోర్టర్ ఫిరోజ్ బేగ్, టీవీ5 స్టాపర్ జనార్ధన్, ఆంధ్రప్రభ బ్యూరో ఇన్చార్జి విజయభాస్కర్ రెడ్డి, పి9 ఎండి పి కిరణ్ కుమార్, ఎంసీఏ అధ్యక్షులు వి నాగేశ్వరరావు, ఎడిటర్స్ పబ్లిషర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి, ఏపీడబ్ల్యూజే ఎఫ్ నాయకులు జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు పాల్గొన్నారు.

జిల్లా కొత్త కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

మహాసభ అనంతరం ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కొత్త కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా వి భక్తవత్సలం, అధ్యక్షులుగా ఎస్కే చిన్న కరీముల్లా, కార్యదర్శిగా దాసరి సునీల్, ఉపాధ్యక్షులుగా ఓబుల శెట్టి రాధాకృష్ణ, ఉప్పుటూరి రాజశేఖర్, రాగిపిండి రామకోటిరెడ్డి ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా పడినపు రవికుమార్, వావిపాటి సుధాకర్, తలారి శైలజ, కోశాధికారిగా ఏనుపోగు కోటయ్య ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎస్కే ఖుష్, వెన్న శ్రీనివాసరెడ్డి, పోలేపల్లి మహేష్, రెక్కల వెంకటేశ్వర్ రెడ్డి, మేడికొండ శ్రీనివాసులు, ఎం శ్రీహరి, షేక్ కరీముల్లా, బి నాగేశ్వరరావు, ఎం ప్రసాద్ బాబు, చింతలపూడి వాసు ఎన్నికయ్యారు.




# అతిథి కార్మికుల ఆశాజ్యోతి

### వలస కార్మికుల పిల్లల చదువులకు ప్రత్యేక పథకం

వలస కార్మికులను అతిథి కార్మికులుగా గౌరవించి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న కేరళలోని వామపక్ష ప్రభుత్వం మరో వినూత్న పథకాన్ని ప్రారంభించింది. వలస వచ్చిన కార్మికుల పిల్లల చదువులు యధావిధిగా కొనసాగించేందుకు ఏ ఆటంకాలు లేకుండా చూసేందుకు జ్యోతి అనే కొత్త పథకాన్ని ముఖ్యమంత్రి పినరై విజయం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగిస్తూ వలస కార్మికులు ఎనలేని సేవలందిస్తున్నారని కొనియాడారు. ప్రస్తుతం కేరళలో వివిధ రంగాల్లో 35 లక్షల మంది అతిథి కార్మికులు ఉన్నారని ఆయన తెలిపారు. వీరిలో ఎక్కువమంది కుటుంబాలతో జీవిస్తున్నారని వీరి పిల్లల బంగారు భవిష్యత్తు కోసమే తమ ప్రభుత్వం జ్యోతి పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అతిథి కార్మికుల చిన్నారులకు విద్యను అందించడం బృహత్తర బాధ్యతగా తమ ప్రభుత్వం భావిస్తుందని ఆయన చెప్పారు. జ్యోతి పథకం ప్రధాన లక్ష్యాలు మూడు నుంచి ఆరేళ్ల వయస్సు గల అతిథి కార్మికుల పిల్లలందరినీ అంగన్వాడీలకు తీసుకురావడం, ఆరేళ్ల వయసు పూర్తి చేసిన వారిని పాఠశాలలకు తీసుకురావడం, అలాగే సాంస్కృతిక విద్యా వికాసానికి కృషి చేయడం అని ముఖ్యమంత్రి వివరించారు. కేరళ పురోభివృద్ధిలో అతిథి కార్మికుల సేవలు ఎనలేనివని వారికోసం తమ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని విజయం చెప్పారు. కేరళ అభివృద్ధికి తమ శ్రమ ద్వారా శక్తినిచ్చే అతిథి కార్మికుల సంక్షేమం, అభ్యున్నతిని జ్యోతి పథకం సహాయపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# గుజరాత్ సమాచార్ యజమాని అరెస్ట్



గుజరాత్ సమాచార్ దినపత్రిక యజమానుల్లో ఒకరైన బాహుబలి షాను ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ రేట్ అరెస్టు చేసింది. ఆయన ఆర్థిక మోసాలకు పాల్పడినట్లు ఆరోపణలు నమోదు చేసింది. గుజరాత్లో అత్యధిక సర్కులేషన్ గల దినపత్రికల్లో గుజరాత్ సమాచార్ ఒకటి. దీనిని బాహుబలి ఆయన సోదరుడు శ్రేయాన్స్ షా నడుపుతున్నారు. ఈడి ఆరోపణల గురించి మేనేజింగ్ ఎడిటర్ శ్రేయాన్స్ మాట్లాడుతూ పాత కేసులో బాహుబలిని అరెస్టు చేశారని ఆయనపై మోపిన ఆరోపణల గురించి తమకు తెలియదని చెప్పారు. గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్యసభ ఎంపీ శక్తి సింగ్ గుహెల్ మాట్లాడుతూ ఐటీ సోదాలు జరిగిన కొన్ని గంటల్లోనే బాహుబలిని ఈ డి అరెస్ట్ చేసిందన్నారు. ప్రధాని మోడీ పైన ఆయన ప్రభుత్వం పైన విమర్శనాత్మక కథనాలు రాయడమే బాహుబలి అరెస్టుకు అసలు కారణమని ఆరోపించారు. గుహిల్ చేసిన ఎక్స్ పోస్టులో సత్యం కోసం గట్టిగా నిలబడిన వారిని శిక్షించటమే బిజెపి ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. గుజరాత్ సమాచార్ ఎల్లప్పుడూ అధికారానికి ఎదురు నిలిచిందని చెప్పారు భారత్ పాకిస్థాన్ ల మధ్య ఉద్రిక్తత విషయంలో మోడీని, బిజెపి ప్రభుత్వాన్ని విమర్శించినందువల్ల మోడీ తన టూల్ కిట్టు తెరిచారని ఆరోపించారు. మోడీ ఐటి ఈడిలను గుజరాత్ సమాచారం పైన దాని టెలివిజన్ ఛానల్ జీఎస్ టీవీ పైన ఉసిగొల్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ గుజరాత్ శాఖ అధ్యక్షుడు ఇసుధన్ గద్వి కూడా ఐటీ సోదాలు ఈడీ అరెస్ట్ ను ఖండించారు. నిర్భయ పాత్రికేయాన్ని బెదిరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి అన్నారు.

# జర్నలిస్టులు - ప్రధాన విధులు

జర్నలిస్టుల విధులు, అందులో ప్రధానమైన విధులు, బాధ్యతలు అనేవి ఈ సమాజంలో చాలా కీలకమైనవి. వారి ప్రధాన లక్ష్యం ప్రజలకు సరైన, నిష్పాక్షికమైన సమాచారాన్ని అందించడం. ఆ విధులు, ప్రధాన విధులు వివరణ.

**వార్తల సేకరణ**

సంఘటనలు, పరిణామాలు, సమస్యలపై సమాచారాన్ని సేకరించడం. ఇందుకోసం వ్యక్తులతో ఇంటర్వ్యూలు చేయడం, ప్రదేశాలను సందర్శించడం, అధికారిక పత్రాలను పరిశీలించడం వంటివి చేస్తారు.

**వార్తల రచన**

సేకరించిన సమాచారాన్ని స్పష్టంగా, సంక్షిప్తంగా, ఆకర్షణీయంగా వార్తలు, కథనాలు, వ్యాసాల రూపంలో రాయడం.

**ఎడిటింగ్**

వార్తల ఖచ్చితత్వాన్ని, స్పష్టతను, వ్యాకరణ లోపాలు లేకుండా చూసుకోవడం.

వాస్తవాలను ధృవీకరించడం కూడా ఇందులో భాగం.

**ప్రసారం/ప్రచురణ**

వార్తలను పత్రికలు, టీవీ, రేడియో, ఆన్‌లైన్ మీడియా వంటి వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అందించడం.

**పరిశోధనాత్మక జర్నలిజం**

అవినీతి, అక్రమాలు, సామాజిక సమస్యల వెనుక ఉన్న నిజాలను లోతుగా పరిశోధించి వెలుగులోకి తీసుకురావడం.

ప్రధాన బాధ్యతలు.

**నిష్పాక్షికత, నిబద్ధత**

వార్తలను ఎటువంటి పక్షపాతం లేకుండా, నిజాలను ఉన్నది ఉన్నట్లుగా ప్రజలకు అందించడం. వ్యక్తిగత అభిప్రాయాలను, సంస్థాగత ప్రయోజనాలను వార్తల్లో చొప్పించకుండా చూసుకోవడం.

**ఖచ్చితత్వం**

వార్తల్లోని ప్రతి వివరము, వాస్తవం, నిజమైనవని నిర్ధారించుకోవడం. తప్పు సమాచారం ప్రజలకు చేరకుండా జాగ్రత్త వహించడం.

**సామాజిక బాధ్యత**

ప్రజలకు ఉపయోగపడే, సమాజానికి మేలు చేసే వార్తలను ప్రచురించడం. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేయడం. నైతిక విలువలు గోప్యతను గౌరవించడం, పరువు నష్టం కలిగించకుండా ఉండటం, సంచలనం కోసం నిరాధారమైన వార్తలను ప్రచురించక పోవడం వంటి నైతిక విలువలను పాటించడం.

**ప్రజాస్వామ్యానికి రక్షణ**

ప్రజలకు సరైన సమాచారం అందుబాటులో ఉంటేనే వారు సరైన నిర్ణయాలు తీసుకోగలరు. జర్నలిస్టులు ప్రభుత్వానికీ, ప్రజలకు మధ్య వారధిగా, ప్రశ్నించే గొంతుకగా వ్యవహరిస్తారు.

**పారదర్శకత**

తమ వార్తా మూలాలను, సమాచార సేకరణ పద్ధతులను వీలైనంత వరకు పారదర్శకంగా ఉంచడం.

**భద్రత**

క్లిష్ట పరిస్థితుల్లో, ప్రమాదకరమైన ప్రాంతాల్లో కూడా వార్తలు సేకరించే ధైర్యం కలిగి ఉండాలి. తమ భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి.

అయితే, నేటి కాలంలో జర్నలిజం అనేక సవాళ్లను ఎదుర్కొంటుంది. వ్యాపార ధోరణి, రాజకీయ ఒత్తిళ్లు, సోషల్ మీడియా ప్రభావం వంటివి జర్నలిస్టుల పనితీరును ప్రభావితం చేస్తున్నాయి. అయినప్పటికీ, సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమైనది, వారి బాధ్యతలు మరింత పెరిగాయి.

# ఫేక్‌న్యూస్ వ్యాప్తిపై చర్యలకు వినతి


ప్రజాశక్తి విలేకరి ముమ్మిడి లక్ష్మణ్‌పై అసత్యవార్తలను ప్రసారం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కాకినాడ జిల్లా ప్రతినిధివర్గం జిల్లా అధ్యక్షుడు వాతాడ నవీన్‌రాజ్ నాయకత్వంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ బిందుమాధవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన ప్రజాశక్తి విలేకరి, ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నాడని, మట్టిమాఫియా ఆగడాలపై ఇటీవలకాలంలో ఆయన పలు కథనాలు రాశాడని, ఇది నచ్చనివారు అసత్యప్రచారాలకు దిగి ట్రోలింగ్స్ చేస్తున్నారని ప్రతినిధివర్గం వివరించింది. ఫేక్ ఐడిలు క్రియేట్ చేసి ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎస్‌పి సానుకూలంగా స్పందించి కేసును పిఠాపురం బదిలీ చేసి వెంటనే తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# కావలిలో నలుగురు జర్నలిస్టుల అరెస్టు

నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గ కేంద్రంలో నలుగురు జర్నలిస్టులను అరెస్టు చేశారు. 2018లో అమృత్ పథకం ద్వారా కావలి మున్సిపాలిటీకి మంజూరైన కార్యక్రమానికి అక్కడ పైలాన్ ఏర్పాటు చేశారు. అయితే ఆ పథకానికి సంబంధించిన ఎలాంటి పనులు చేపట్టలేదు. సదరు పైలాన్ 2020 లో కొంత భాగం తొలగించి ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేశారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ ద్వారా ఇప్పుడు ఫిర్యాదు చేయించి కేసు నమోదు చేయించారు. వారికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారని అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని జర్నలిస్ట్ సంఘాలు మండిపడుతున్నాయి. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. వారికి 14 రోజుల రిమాండ్ విధించారు అక్రమంగా కేసులు నమోదు చేశారని తమ వారికి ఎటువంటి సంబంధం లేకపోయినా ఇరికించారని జర్నలిస్టుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అక్రమ కేసులను ఎత్తివేయాలి**


కావలి రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో పోలీసులు జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేషన్ ఎత్తివేయాలని జర్నలిస్టు సంఘాల ఐక్యవేదిక నాయకులు జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ను కోరారు. అన్ని జర్నలిస్ట్ సంఘాల ఐక్యవేదిక నాయకులు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకులను బెదిరించే దారులతో ఉద్దేశపరంగా జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. అందుకు ఈ సంఘటన నిదర్శనం అన్నారు. కావలి పట్టణంలో అమృత పథకం పై నిర్మించిన పైలాన్ కు గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు అన్నారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు మేరకు కావలి రెండో పట్టణ పోలీసులు మరుసటి రోజు కేసు నమోదు చేసిన సరైన సాక్షాధారాలు లేని కారణంగా కేసును మూసివేశారన్నారు. కూటమి నేతల వైఫల్యాలను, ఆక్రమాలను ఎత్తిచూపుతున్నారు. ఐదేళ్ల అనంతరం ఆ కేసులు ఓపెన్ చేయించి పైలాన్ ధ్వంసం ఘటనలో ఎలాంటి సంబంధం లేని కావలి సాక్షి ఆర్ సి ఇన్చార్జి కే శ్రీనివాసులు, ఏ మాలకొండయ్య, బి వెంకట లక్ష్మీనారాయణ, ప్రసాదులతో పాటు మరికొందరు జర్నలిస్టులపై నిందితులుగా చేర్చి 307 ఐపిసి తదితర నాన్ వెలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేయించారు. పోలీసులు ఒకటిగా నలుగురు జర్నలిస్టులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. సమాజం కోసం అహర్నిశలు పనిచేసే జర్నలిస్టులు హత్యాయత్నానికి పాల్పడినట్లు పేర్కొంటూ నాన్ బెయిలబుల్ కేసులు పెట్టడం దారుణమన్నారు. మీడియాలో లేని ప్రసాద్ ను సైతం కేసులో నిందితునిగా చేర్చడం అక్రమ కేసుకు తార్కాణంగా నిలుస్తుంది అన్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి పూర్వాపరాలు విచారించి అక్రమ కేసులను ఎత్తివేయాలి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు అందుకు ఎస్పీ స్పందిస్తూ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని వెల్లడించారు.




## జర్నలిస్ట్ కుటుంబం దారుణ హత్య

బలూచిస్తాన్ లో దారుణం చోటుచేసుకుంది. జర్నలిస్ట్ అబ్దుల్ లతీఫ్, అతని కుటుంబ సభ్యులు ఏడుగురిని పాకిస్తాన్ సైన్యం సహకారం అందిస్తున్న మిలిటెంట్లు కాల్చి చంపేశారు. ఆవరన్ పట్టణంలో ఈ సంఘటన జరిగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ప్రత్యేక ఉద్యమం నిర్వహిస్తున్న బలూచి తీవ్రవాదులకు పాకిస్తాన్ సైన్యానికి మధ్య జరుగుతున్న ఘర్షణలో పెద్ద ఎత్తున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

# జైళ్ళ నుంచి జర్నలిస్టులను విడిచి పెట్టాలి



జైళ్లలో ఉన్న జర్నలిస్టులందరినీ వెంటనే విడుదల చేయాలని నూతన పోప్ లియో 14 పిలుపునిచ్చారు. పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్రం మనకున్న విలువైన కానుకలని ఆయన నొక్కి చెప్పారు. మొట్టమొదటిసారిగా ఆయన మీడియాతో మాట్లాడారు. వాటికన్ సిటీలో ఆడిటోరియంలోకి ఆయన ప్రవేశించడంతోనే అందరూ లేచి నిలబడి చప్పట్లతో స్వాగతం పలికారు. శాంతి బలోపేతమయ్యేలా యుద్ధాన్ని తిరస్కరించేలా రాయాలని అనగారిన వారికి గొంతుకగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా సత్యాన్ని కనుగొనే క్రమంలో జైళ్ల పాలైన జర్నలిస్టులకు ఆయన సంఘీభావం ప్రకటించారు. అటువంటి వారిని వెంటనే విడుదల చేయాలని ఆయన పిలుపునివ్వగానే ప్రాంగణమంతా చప్పట్లతో ప్రతిధ్వనించడం విశేషం. “ఇటువంటివారిని చర్చి గుర్తిస్తుంది. ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి యుద్ధం పురోగతిని గురించి బయట ప్రపంచానికి తెలిపే వారి గురించి నా తపనంత గౌరవం న్యాయం ప్రజల సమాచార హక్కును కాపాడే ధీరులు వీరంతా ఎందుకంటే సమాచారం ఉంటేనే కదా ఎంపికలో స్వేచ్ఛ ఉండేది” అని పేర్కొన్నారు. మనం ఇతరులను చూసే విధానం వారి మాట వినడం, వారి గురించి మాట్లాడే విధానం ద్వారా శాంతి మనతోనే ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. పోప్ ఎన్నికను కవర్ చేసేందుకు ప్రపంచ దేశాల నుంచి తరలివచ్చిన సుమారు 6000 మంది పాత్రికేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రారంభంలో కొద్దిసేపు ఇంగ్లీషులో మాట్లాడిన ఆయన ఆ తర్వాత మొత్తం ఇటాలియన్ లోనే ప్రసంగం కొనసాగించారు. ముందు వరుసలో ఉన్న కొందరు జర్నలిస్టులను పోప్ 14 పలకరించారు. హాలు నుంచి తిరిగి బయటకు వెళ్లేటప్పుడు కొందరితో కడచాలన చేశారు. ఆటోగ్రాఫ్ల పై సంతకం చేశారు. కొందరితో సెల్ఫీలకు ఫోజు ఇచ్చారు.

## సీనియర్ జర్నలిస్ట్ సన్యాసిరావు మృతి



హైదరాబాద్ కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ మారేమండ రాఘవేంద్ర సన్యాసిరావు అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల నేషనల్ అలయన్స్ జర్నలిస్ట్ తెలంగాణ శాఖ కన్వీనర్ ఎంఏ రవూఫ్, ప్రెస్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కమిటీలు ప్రగాఢ సంతాపం తెలియజేశాయి. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

## చింతపల్లిలో విలేకరి మృతి

చింతపల్లికి చెందిన పాత్రికేయుడు గుండుమల్ల యేసురత్నం(58) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన ప్రజాశక్తి దినపత్రికలో దీర్ఘకాలం పనిచేశారు. కొంతకాలంగా అన్వేషణ పత్రికలో పనిచేస్తున్నారు. చింతపల్లి ఏరియా ఆసుపత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం తీసుకువెళ్లే ప్రయత్నంలో ఆయన మరణించారు.

# ఈఎస్ఐ పథకం ఉద్దేశం ప్రయోజనాలు

ఈఎస్ఐ పథకం ఒక గొప్ప సాంఘిక భద్రత పథకం. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు 41, 42, 43 లో నిర్దేశించిన పని హక్కు, విద్యా హక్కు, నిరుద్యోగ సహాయం, వృద్ధులకు, జబ్బు పడిన వారికి, పని చేయలేకపోయిన వారికి ప్రభుత్వం సహాయం చేయాలనే ఆదేశిక సూత్రాలను అనుసరించి 1948లో కార్మిక రాజ్య బీమా చట్టం ద్వారా కార్మిక రాజ్య భీమా సంస్థ ఏర్పాటు చేశారు. ఈ పథకం 24–2– 195 2న మొదట కాన్పూర్, ఢిల్లీలో అమలుపరిచి తరువాత కొన్ని నిర్దేశించిన పారిశ్రామిక ప్రాంతాలకు విస్తరించారు. 2016 సెప్టెంబర్ నుంచి ఆంధ్రప్రదేశ్ లోని అన్ని ప్రాంతాలకు వర్తింప చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనీ అన్ని పరిశ్రమలు, సంస్థలు 10 మంది కార్మికులు గలవారు విధిగా ఈ చట్టాన్ని అమలు చేయాల్సి ఉంది.

ఈ పథకం ముఖ్య ఉద్దేశం

కార్మిక రాజ్య భీమా చట్టం కింద నమోదైన కార్మికులు అస్వస్థతకు గురి అయినప్పుడు, కార్మికురాలు ప్రసవించినప్పుడు, ఉద్యోగ సంబంధమైన ప్రమాదాలకు గురైనప్పుడు లేదా మరణించినప్పుడు, ఇతర వృత్తి సంబంధమైన కారణాలవల్ల పనికి వెళ్లలేనప్పుడు ఆర్థిక సహాయం చేయడానికి ఆయన, వారి కుటుంబ సభ్యులకు అన్ని రకాల వైద్య సౌకర్యం కల్పించడం ముఖ్య ఉద్దేశం. ఇతర ఇన్సూరెన్స్ సంస్థల మాదిరిగానే బీమా అనే స్వభావం కార్మిక రాజ్య భీమా చట్టంలో నిబిడీకృతమై ఉంది. అయితే ఇతర భీమా సంస్థలు కేవలం ఒకటే చందా ఒకటే ప్రయోజనం చేకూరుస్తాయి. కానీ కార్మిక రాజ్య భీమా పథకం ఒకేచందా బహుళ ప్రయోజనాలు పొందుటకు ఉద్దేశించింది. ముఖ్యమైన ఐదు ప్రయోజనాలతో పాటు అదనంగా 9 ప్రయోజనాలు అనగా మొత్తం 14 ప్రయోజనాలు వాటి వివరాలను సూక్ష్మంగా కింద వివరించడం అయినది.

ఈ పథకం వర్తించే పరిశ్రమలు సంస్థలు

ఏదైనా పరిశ్రమ సంస్థ కనీసం పదిమంది కార్మికులకు ఉపయోగించుకొని తయారీ రంగంలో ఉన్న అన్ని పరిశ్రమలు, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంస్థలకు తప్పనిసరిగా వర్తిస్తుంది. అట్టి సంస్థలు ఏమనగా వార్తాపత్రికలు, సినిమాహాళ్లు, రవాణా సంస్థలు, దుకాణాలు, సంస్థలు, హెూటళ్ళు, ప్రైవేటు విద్యాసంస్థలు, ప్రైవేటు ఆసుపత్రులు మొదలైన సంస్థలకు ప్రస్తుతం ఈ చట్టం అమలవుతుంది. యాజమాన్యం ఇష్టాను సారంగా కాకుండా ఈ చట్టాన్ని తప్పనిసరిగా అమలు చేయాలి. చట్టాన్ని అమలు చేయనివారు చట్టంలో ఉద్దేశించిన విధంగా శిక్షార్హులవుతారు.

ఈ చట్టం పరిధిలోకి వచ్చే కార్మికులు ఈ చట్టం ఏదైనా పరిశ్రమలకు సంస్థలకు వర్తింపజేసిన తేదీ నుంచి అందులో పనిచేస్తున్న కార్మికులు ఎవరైతే వారి ప్రస్తుత నెలవారి వేతనం 21 వేల రూపాయలు, అంతకంటే తక్కువ పొందుతున్న వారికి మాత్రమే వర్తిస్తుంది.

ఈఎస్ఐ చట్టంలో నమోదు చేసే విధానం

ఈ చట్టం పరిధిలోకి వచ్చే కర్మాగారాలు, సంస్థలు ఈఎస్ఐ చట్టం ప్రకారం నమోదు చేసుకోవడానికి www.shramasuvidha.gov.in లేదా www.esic.in వెబ్ పోర్టల్ ద్వారా ఆన్లైన్లో విధిగా రిజిస్టర్ చేసుకోవాలి. పరిశ్రమ, సంస్థ నమోదు సమయంలోనే కార్మికులను కూడా నమోదు చేయాలి.

ఆర్థిక వనరులు ఈఎస్ఐ చందా వివరాలు

యాజమాన్యం ఉద్యోగుల నుంచి వచ్చే చందాల ద్వారా ఈఎస్ఐ పథకానికి ఆర్థిక వనరులు సమకూరుతాయి. ఉద్యోగులకు చెల్లించే మొత్తం వేతనంపై యజమాని వాటాగా 3.25 శాతాన్ని 0.75 శాతాన్ని ఉద్యోగుల వాటాగా చెల్లించాలి. (1– 7– 2013 నుంచి) యాజమాన్యం తమ నెలసరి ఈఎస్ఐ చందాలను ఆన్లైన్ ద్వారా ప్రతి నెల 15వ తేదీ లోపుగా చెల్లించాలి.

ఈఎస్ఐ చట్టం అమలు చేయడం వలన యజమానికి కలిగే ప్రయోజనం

1. 1923 కంపెన్సేషన్ చట్టం, మెటర్నటీ చట్టం 1961 అమలు నుంచి పూర్తిగా మినహాయింపు

2. కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించే బాధ్యత నుంచి వెసులుబాటు

3. యాజమాన్యపు చందా మొత్తం ఆదాయపు పన్నుంచి మినహాయింపు

4. యజమానికి బీమా రక్షిత కార్మికులు ఉండడం వలన సదరు కర్మాగార, సంస్థల ఉత్పాదక శక్తి పెరుగుటకు దోహదపడుతుంది.

ఈ పథకానికి సంబంధించి తదుపరి విచారణకు సందేహ నివృత్తికి రీజినల్ ఆఫీస్ పరిధిలోని మీ సమీప ఈఎస్ఐసి కార్యాలయాలను

సందర్శించవచ్చు. భీమా దారులకు ఈఎస్ఐ పథకంలోని మరికొన్ని ఇతర ప్రయోజనాలు

1. అంత్యక్రియల ఖర్చులు: భీమా దారులు ఈఎస్ఐ పథకంలోని ఏదైనా ఒక ప్రయోజనానికి అర్హుడై ఉండి మరణించినట్లయితే ఆ కుటుంబ పెద్దకు గాని లేదా అంత్యక్రియల ఖర్చులు భరించిన ఏ ఇతర వ్యక్తికైనా మరణ ధ్రువీకరణ పత్రం దాఖలు చేసే షరతుపై గరిష్టంగా 15 వేల రూపాయలు ఇస్తారు.

2. ప్రసవ ఖర్చులు: ఈఎస్ఐ వైద్య సదుపాయం లేని ప్రాంతంలో భీమా దారులు కానీ భీమా దారుని భార్య గాని ప్రసవించినట్లయితే అట్టి ప్రసవాలకు 7500 చొప్పున గరిష్టంగా రెండు ప్రసవాలకు ప్రసవ ఖర్చుల ప్రయోజనం రూపంలో చెల్లిస్తారు.

3. కుటుంబ నియంత్రణ ప్రయోజనం: అనారోగ్య ప్రయోజనానికి అర్హత కలిగిన భీమా దారులు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేసుకొని సంబంధిత ఆసుపత్రి ఈఎస్ఐ వైద్యశాలచే ఇచ్చిన పత్రాలను సమర్పిస్తే వారికి వేసక్టమీకి ఏడు రోజులు, ట్యూబెక్టమికి 14 రోజులు సరాసరి దినసరి వేతనం ఇస్తారు.

4. విధి నిర్వహణలో జరిగిన ప్రమాదంలో ఏర్పడిన వైకల్యం కారణంగా ఉద్యోగం కోల్పోయిన భీమా దారులు వారి జీవిత భాగస్వామికి ఏర్పరిచిన వైద్య సంరక్షణ సంవత్సరానికి 120 రూపాయలు చొప్పున ముందుగా చెల్లించినట్లయితే పథకం భీమా దారులకు వారి జీవిత భాగస్వామికి సదరు భీమాదారునికి పదవి విరమణ వయస్సు వచ్చు వరకు ఈఎస్ఐ వైద్య సంస్థల ద్వారా వైద్య సేవలు లభిస్తాయి (సూపర్ స్పెషాలిటీ వైద్య సదుపాయం మినహాయించి). ఈ ప్రయోజనం పొందుతూ భీమా దారులు మరణించినప్పటికీ సదరు జీవిత భీమా దారుని జీవిత భాగస్వామి ఈ సదుపాయాన్ని కొనసాగించుకొనవచ్చు.

5. పదవి విరమణ లేదా స్వచ్ఛంద పదవి విరమణ చేసిన భీమా దారులకు వారి జీవిత భాగస్వామికి ఏర్పరచిన వైద్య సంరక్షణ కనీసం ఐదు సంవత్సరాలు ఈఎస్ఐ చందా చెల్లించిన భీమా దారులు ఈ ప్రయోజనానికి అర్హులు. సంవత్సరానికి 120 రూపాయల చొప్పున ముందుగా చెల్లించినట్లయితే సదరు భీమాదారులకు, వారి జీవిత భాగస్వామికి ఈఎస్ఐ వైద్య సంస్థల ద్వారా వైద్య సేవలు లభిస్తాయి (సూపర్ స్పెషాలిటీ మినహాయించి). ఈ ప్రయోజనం పొందుతూ భీమా దారులు మరణించినప్పటికీ సదరు భీమా దారుని జీవిత భాగస్వామి ఈ సదుపాయాన్ని కొనసాగించవచ్చు.

6. ఆశ్రిత ప్రయోజనం పొందే వితంతువుకు వైద్య సంరక్షణ సంవత్సరానికి 120 రూపాయలు చొప్పున ముందుగా చెల్లించినట్లయితే ఆశ్రిత ప్రయోజనం పొందుతున్న వితంతువుకు ఈఎస్ఐ వైద్య సంస్థల ద్వారా అందించే అన్ని సేవలు లభిస్తాయి (సూపర్ స్పెషాలిటీ వైద్య సదుపాయం మినహాయించి).

7. రాజీవ్ గాంధీ శ్రామిక కళ్యాణ్ యోజన: నిరుద్యోగ భృతి విధి నిర్వహణలో కాకుండా బయట జరిగిన ప్రమాదాలలో 40% వైకల్యం చెందిన భీమా దారులకు కర్మాగారం లేదా సంస్థ మూసివేత వలన గాని రిటైర్మెంట్ వలనకానీ ఉద్యోగం కోల్పోయిన భీమా దారులకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. సదరు భీమా దారుడు గత రెండు సంవత్సరాల్లో ప్రతి చందాకాలంలో 78 రోజులు చందా కలిగి ఉండాలి. భీమా దారుల మొత్తం జీవిత కాలంలో 24 నెలల పాటు ఈ నిరుద్యోగ భృతి లభిస్తుంది. మొదటి 12 నెలలు భీమా దారుని సరాసరి వేతనంపై 50% లభిస్తుంది. తదుపరి 12 నెలలు 25% లభిస్తుంది ఈ నిరుద్యోగ భృతి పొందే సమయంలో భీమా దారులకు వారి జీవిత భాగస్వామికి వైద్య సదుపాయం లభిస్తుంది. ఈ సమయంలో భీమా దారుని వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి తీసుకునే వృత్తి శిక్షణకు గరిష్టంగా ఒక సంవత్సరం ప్రభుత్వ సంస్థలకు చెల్లించిన మొత్తాలను ఈఎస్ఐసి తిరిగి చెల్లిస్తుంది. 8. వృత్తి పునరావాస భత్యం: విధి నిర్వహణలో జరిగిన ప్రమాదంలో కనీసం 40% వైకల్యం పొంది 45 సంవత్సరాల లోపు ఉన్న భీమా దారులకు మాత్రమే వర్తిస్తుంది. 30 నుంచి 45 రోజుల వరకు వృత్తి పునరావాస కేంద్రాల నియమాల ప్రకారం ప్రభుత్వ సంస్థల్లోనూ, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలలోనూ ఏదో ఒక వృత్తి శిక్షణ ఇస్తారు.

9. ఈఎస్ఐసి నిర్వహించు వైద్య కళాశాలలో భీమా దారుల సంతానానికి విద్యా అవకాశం: సంబంధిత నియమ నిబంధనలకు లోబడి భీమా దారుల సంతానానికి ఈఎస్ఐసి నిర్వహించే వైద్య కళాశాలలో విద్యనభ్యసించే అవకాశం నిబంధనలకు లోబడి రిజర్వేషన్ సౌకర్యం ఉంటుంది.

పైన పేర్కొన్న ప్రయోజనాలు సంస్థ యజమాని సకాలంలో కార్మికులను ఆన్లైన్ ద్వారా రిజిస్టర్ చేసి సకాలంలో చందా చెల్లించడం వలన ఎటువంటి ఆటంకాలు లేకుండా పొందవచ్చు.

**డిప్యూటీ డైరెక్టర్ ఈ ఎస్ ఐ సి**

ఉప ప్రాంతీయ కార్యాలయం విశాఖపట్నం

# లేబర్ ఇన్సూరెన్స్ వినియోగించుకోండి

ప్రభుత్వ ఉద్యోగులు తప్ప కూలీలతో పాటు అందరూ అర్హులే. తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి. ఏడాదికి 22 రూపాయలు మాత్రమే. ఐదు సంవత్సరాలు కు ఒకేసారి చెల్లించాలి. కేవలం 110 రూపాయలు మాత్రమే. అవగాహన పెంచుకుందాం. అందరికీ చేరేలా చూడండి. 18 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాలు ఉన్న స్త్రీ పురుషులు ఈ పథకానికి అర్హులు. ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ఎలాంటి కూలీలైన ఇతరులైన ఇందులో చేరవచ్చు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ జతచేయాలి. బ్యాంకు చలానా జత చేసి లేబర్ ఆఫీసులో ఇవ్వాలి.

**ప్రయోజనాలు**

పాలసీదారు సహజమరణం పొందితే 1,30,000 ఇన్సూరెన్స్ గా వస్తుంది. అలాగే ప్రమాదవశాత్తు సంభవించే మరణం వల్ల 6 లక్షల రూపాయలు పొందవచ్చు. ఒక ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు ఉంటే ఒక్కొక్కరికి వివాహ నజరానాగా 30వేల రూపాయలు చెల్లిస్తారు. ప్రసవ కానుకగా రెండు ప్రసవాలకు 30 వేల రూపాయలు చొప్పున వచ్చే అవకాశం ఉంది. ఒక ఏడాది పాలసీ పొందిన తరువాత లబ్ధిదారునికి ప్రమాదం జరిగి 50% వికలాంగులుగా ఉంటే రెండు లక్షల 50 వేలు, అదే 100% ఉంటే 5 లక్షలు పరిహారం పొందే అవకాశం ఉంది. ఈ లేబర్ ఇన్సూరెన్స్ ఒకసారి 110 రూపాయలు చెల్లిస్తే ఐదు సంవత్సరాల వరకు చెల్లించిన అక్కర్లేదు. అంటే మీరు చెల్లించేది సంవత్సరానికి 22 రూపాయలు అన్నమాట. వెంటనే మీరు మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు బంధువులు అందరినీ చేర్పించండి. కి ఇలాంటి ప్రయోజనాలు ప్రతి కుటుంబానికి అత్యంత అవసరం అయినవి.

కావున వెంటనే మీ మండలంలోని కార్మిక అధికారిని ఎంపీడీవో /తాసిల్దార్ను సంప్రదించండి. చివరిగా ఒక మాట. ఈ పథకంలోకి చాలామంది కార్మికులు మాత్రమే చేరవచ్చని అనుకుంటున్నారు. అది కానే కాదు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి కుటుంబం మీ పథకానికి అర్హులే. ఈ సమాచారాన్ని వీలైనంత ఎక్కువ మందికి పంపి ఈ పథకాన్ని వినియోగించుకునే విధంగా చూడండి.

# సీనియర్ జర్నలిస్ట్ మునీర్ మృతి



తెలంగాణ ఉద్యమ జర్నలిస్టు, సకలజనుల సమ్మె సింగరేణి కన్వీనర్ ఎండి మునీర్ (60) మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్ తో హైదరాబాదులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. మంచిర్యాల జిల్లాలో పుట్టిన మునీర్ కు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సింగరేణిలో ఉద్యోగిగా ఉంటూ జర్నలిస్టుగా పనిచేసేందుకు ఆనాటి సింగరేణి యాజమాన్యం అభ్యంతరం చెప్పడంతో ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తికాలం పలు పత్రికల్లో జర్నలిస్టుగా కొనసాగారు. వివిధ పత్రికల్లో పని చేసిన మునీర్ సింగరేణి సంబంధించి ఎన్నో విషయాల్లో ప్రజలను చైతన్య పరిచారు. సింగరేణి కార్మికుల నడుమ జీవిస్తూ వారి సమస్యలను వెలుగుతో వెలుగులోకి తెస్తూ నిబద్ధత కలిగిన పాత్రికేయునిగా సుదీర్ఘకాలం పనిచేసిన మునీర్ కృషిని గుర్తు చేసుకున్నారు. ఎండి మునీర్ మృతి పట్ల నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్ తెలంగాణ శాఖ కన్వీనర్ ఎండి రవూఫ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.



# సీనియర్ ఫోటోగ్రాఫర్ శివకుమార్ మృతి

సీనియర్ ఫోటోగ్రాఫర్ పీవీ శివకుమార్, హైదరాబాదులో గుండెపోటుతో మరణించారు. ఆయన సుదీర్ఘకాలం ద హిందూ దినపత్రికలో ఫోటోగ్రాఫర్ గా పనిచేశారు. ఆయన మృతి పట్ల నేషనల్ తెలంగాణ శాఖ కన్వీనర్ ఎంఏ రావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

# భావప్రకటన స్వేచ్ఛపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 19(1)(ఎ) భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుకు మరింత బలం చేకూర్చే తీర్పును ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చింది. ఈ తీర్పు భావప్రకటనా స్వేచ్ఛకున్న ప్రాధాన్యాన్ని మరింత స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తాజాగా వెలువరించిన ఇమ్రాన్ ప్రతాప్‌గఢి వర్సెస్ గుజరాత్ ప్రభుత్వం కేసు తీర్పు భావప్రకటన స్వేచ్ఛను మరింత బలపరిచేలా ఉంది. ఈ తీర్పు ప్రకారం, వ్యక్తిగత భావప్రకటనా స్వేచ్ఛ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసేముందు, ప్రాథమిక విచారణ జరిపి, అది నిజమైన నేరమా లేక కేవలం అభిప్రాయాల వ్యక్తీకరణమేనా అనే విషయం తేల్చాలి.

తీర్పులోని ముఖ్యాంశాలు:

1. భావప్రకటన స్వేచ్ఛ అనేది ప్రజాస్వామ్యంలో కీలకం:

వ్యక్తుల ఆలోచనలను, అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచే హక్కు లేకుంటే, ప్రజాస్వామ్యం అసలు ఉద్దేశం నెరవేరదు.

ఈ హక్కు లేకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ద్వారా హామీ ఇచ్చిన "గౌరవప్రదమైన జీవితం" సాధ్యం కాదు.

న్యాయవ్యవస్థ అభిప్రాయాలను సమర్థించనంత మాత్రాన, వాటిని నేరంగా పరిగణించలేమని కోర్టు స్పష్టం చేసింది.

2. పోలీసు వ్యవస్థ ఆచరణలో ఏమి చేయాలి?

ఎవరైనా వ్యక్తిగత అభిప్రాయం చెప్పినందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందు,

1 ఆ అభిప్రాయాలు రాజ్యవ్యతిరేకమా?

2 నేరానికి ప్రేరేపించేలా ఉన్నాయా?

3 లేక సింపుల్‌గా ఒక అభిప్రాయ ప్రదర్శన మాత్రమేనా?

అన్న విషయాలను ముందుగా పరిశీలించాలి.

వెంటనే కేసు నమోదు చేయకుండా, ప్రాథమిక విచారణ జరిపి, అది నిజమైన నేరమా లేక వాగ్దాటా మాత్రమేనా అనే విషయం తేల్చాలి.

3. అభిప్రాయాలను నేరంగా చిత్రీకరించడం తగదు:

వ్యక్తులు తమ అభిప్రాయాలను వెల్లడించడమే నేరంగా పరిగణిస్తే, ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది.

నేరపూరిత ఉద్దేశ్యంతో కూడిన ప్రసంగం, సాధారణంగా చేసిన వ్యాఖ్యలు మధ్య తేడా గుర్తించాలి.

కోర్టు ముఖ్యమైన వ్యాఖ్యలు:

"కేవలం ఎవరైనా తాము ఇష్టపడని మాటల్ని విన్నారన్న కారణంతో దానిని నేరంగా చిత్రీకరించలేరు!"

"పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసేముందు భావప్రకటన స్వేచ్ఛ హక్కును గౌరవించాలి."

"వ్యక్తిగతంగా ఒక న్యాయమూర్తి ఓ అభిప్రాయాన్ని ఇష్టపడకపోవచ్చు. కానీ రాజ్యాంగ హక్కును హరించలేరు!"

తీర్పు ద్వారా సమాజానికి లాభం ఏమిటి?

ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పుకునే హక్కు మరింత బలపడింది.

మీడియా, సామాజిక కార్యకర్తలు, సామాన్య పౌరులు అకారణంగా కేసుల బారిన పడకుండా ఉండటానికి ఇది రక్షణ కల్పిస్తుంది.

ఈ తీర్పు బలవంతపు ప్రభుత్వ దోపిడీని, భిన్నాభిప్రాయాలను అణగదొక్కే ప్రయత్నాలను అడ్డుకుంటుంది.

సారాంశం:

ఈ తీర్పు భావప్రకటన స్వేచ్ఛకు మరింత బలం చేకూరుస్తుంది. పోలీస్ శాఖ విచక్షణగా వ్యవహరించాలని, ప్రతి విమర్శను నేరంగా ముద్రించరాదని కోర్టు స్పష్టంగా తెలిపింది.

ప్రజాస్వామ్య దేశంలో ప్రతి పౌరుడికి స్వేచ్ఛగా మాట్లాడే హక్కు ఉందని, అది రాజ్యాంగ పరిరక్షణలో ఉందని కోర్టు తేల్చిచెప్పింది.


## తొట్టంబేడు విలేఖరి మెహర్ మృతి

తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలంలో వార్త విలేకరిగా పనిచేస్తున్న మెహర్ కుమార్ మృతి చెందారు. పాత్రికేయ వృత్తిలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్న మెహర్ కుమార్ నిజాయితీ కలిగిన పాత్రికేయుడు. సమాజంపై చెరగని ముద్ర వేసే రీతిలో వార్తలు రాసేవాడు ఆయన మృతి పట్ల శ్రీకాళహస్తి జర్నలిస్టులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## జర్నలిస్టు రవీంద్ర మృతి

చేజర్ల మండలంలో జర్నలిస్టుగా పనిచేస్తున్న రవీంద్రబాబు అనారోగ్యంతో మృతి చెందారు ఆయన మృతి పట్ల స్థానిక జర్నలిస్టులతోపాటు నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

సాక్షి సంపాదకుని ఇంటిపై
# పోలీసు సోదాలపై నిరసన



సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర రాజధాని విజయవాడలో జిల్లా కలెక్టరును కలిసి వినతిపత్రం అందజేశారు. చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోని వివిధ కేంద్రాల్లో జర్నలిస్టులు ధర్నాలు చేసి తమ నిరసన తెలియజేశారు. పోలీసులు చేస్తున్న ఈ సోదాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతమని, మీడియా స్వేచ్ఛకు నష్టం కలిగిస్తుందని ఆందోళనలో పాల్గొన్న జర్నలిస్టులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అక్రమ కేసులు బనాయించి దాడులు చేయడం ద్వారా మీడియాను భయపెట్టలేరన్నారు. జర్నలిస్టులకు రాజకీయాలను ఆపాదించే ధోరణి మంచిది కాదని మీడియా పట్ల ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకోవాలని కోరారు. విజయవాడలో ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి జి.ఆంజనేయులు, ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్‌లు పాల్గొన్నారు.

**చిత్తూరు జిల్లా శాఖ ఖండన**

సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై పోలీసులు ఎలాంటి నోటీసులు లేకుండా దాడులు నిర్వహించడాన్ని ఏపీడబ్ల్యూజేఎఫ్ చిత్తూరు జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తోంది. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు పత్రిక స్వేచ్ఛను హరించడమే. ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా పత్రిక ప్రతినిధుల పైన అక్రమ కేసులు బనాయిస్తున్నారు. పత్రికల పైన పత్రికా ప్రతినిధుల పైన పోలీసులు దాడులు మానుకోవాలని ఇలాంటి చర్యలు పునరావృతం అయితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఫెడరేషన్ నాయకులు కవరకుంట్ల జయరాజ్, చిత్తూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రకాష్, సలీం భాష, ఎపిబిజెఎ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చల్లా జయచంద్ర, నీరజాక్షులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**కర్నూలులో నల్లబ్యాడ్జీలతో నిరసన**

సాక్షి ఎడిటర్ దనుంజయ రెడ్డి పై అక్రమ కేసులు పెట్టడం ఆయన ఇంటికెళ్లి పోలీసులు వేధింపులకు గురిచేయడం హేయమైన చర్యని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోరంట్లప్ప ,జిల్లా కన్వీనర్ నాగేంద్ర, ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు హుస్సేన్, సాక్షి బ్యూరో రవి వర్మ,సాక్షి ఛానల్ కరస్పాండెంట్ లోకేష్ లు ఖండించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టర్ కార్యాలయం గాంధీ విగ్రహం ముందు ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షుడు శివశంకర్ అధ్యక్షతన నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి ఎడిటర్ సాక్షి పత్రికపై రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరిత విధానాలు మానుకోవాలని పత్రికలను టార్గెట్ చేసి నిర్బందాలు పెట్టడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. అప్రజాస్వామిక విధానాలు అమలు చేస్తూ భయానక వాతావరణాన్ని సృష్టించి, పరువుప్రతిష్ఠలు భంగం కలిగించేలా ఎలాంటి సర్చ్ వారెంట్ లేకుండా ఇళ్లలోకి






పోలీసులు వెళ్ళడం పత్రిక స్వేచ్ఛకు గొడ్డలి పెట్టని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకుల 11 నెలల కాలంలో మీడియా పై దాడులు పెరుగుతున్నాయి, జర్నలిస్టులను బెదిరిస్తున్నారు, దాడులు చేసి కార్యాలయాలపై దాడులు చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని జర్నలిస్టుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మీడియా పై దాడుల నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర స్థాయిలో హైపవర్ కమిటీ, జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వడ్డే శ్రీనివాసులు, ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు రమేష్, రాజశేఖర్ నాయుడు,రామకృష్ణ, జమ్మన్న, కుమార్, శ్రీనివాసులు, అనిల్, పురుషోత్తం, సాక్షి సిబ్బంది అంకన్న,శేఖర్,వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెలో

సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిలో ఎలాంటి అనుమతులు లేకుండా నోటీసులు ఇవ్వకుండా పోలీసులు సోదాలు చేయడం దారుణమని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ మద్దయ్య యాదవ్, బనగానపల్లె నియోజకవర్గం అధ్యక్షులు గుండం సర్వేశ్వర రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిలో పోలీసులు సోదాలు చేయడంతో నిరసన వ్యక్తం చేశారు  అనంతరం తహసిల్దార్ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డికి ముందస్తుగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు ఇంటిలో చొరబడి సోదాలు చేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వాలు జర్నలిస్టులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఆంధ్ర అక్షర రామచంద్రారెడ్డి, సూర్య నరసింహారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి స్వతంత్ర న్యూస్ షాషావలి, మండల అధ్యక్షులు చంద్రశేఖర్, కార్యదర్శి బాల చెన్నయ్య,, మండల ఉపాధ్యక్షులు నేను సైతం మధు, మండల కార్యదర్శి సూర్య రాజేష్, నాయకులు ఓబులేసు, బాలయ్య జర్నలిస్టులు పాల్గొన్నారు.

చిత్తూరులో ధర్నా

గత కొన్ని రోజులుగా పలు పత్రికా కార్యాలయాలు,  పాత్రికేయులపై



అటు అధికారులు, ఇటు పలువురు ప్రజాప్రతినిధులు దాడులకు తెగబడుతున్నారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం అధికారులకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ పని చేస్తున్న పాత్రికేయులకు రక్షణ లేకుండా పోతోంది. కలంపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టలాంటిది. ఆ విషయం తెలిసి కూడా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తమ పరిమితులను దాటి ప్రవర్తిస్తున్నారు. అందులో భాగంగానే తాజాగా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంటిలో పోలీసులు ఏకపక్షంగా సోదాలు నిర్వహించారు. దీన్ని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( ఏపీడబ్ల్యూజేఎఫ్ ) తీవ్రంగా ఖండిస్తోంది. పత్రికా కార్యాలయాలు, పాత్రికేయులపై జరుగుతున్న దాడులు, సోదాల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి ఇకపై అలా జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు కవరకుంట్ల జయరాజ్, జిల్లా అధ్యక్షులు బి ప్రకాష్, జిల్లా కోశాధికారి కృపానందరెడ్డి, సంయుక్త కార్యదర్శి యాదవేంద్రరెడ్డి, ఉపాధ్యక్షులు గందోడి హరిప్రసాద్, చిత్తూరు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఏ కేశవులు, బాలసుబ్రమణ్యం, సంయుక్త కార్యదర్శులు కుపేంద్ర, ఉమాశంకర్, కార్యనిర్వహ కార్యదర్శి విజయ్ కుమార్, పాత్రికేయులు మురళి, గిరిజన జయబేరి ఎడిటర్ ఈ రఘురాం, దాము తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పొడిగింపు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలు పాటు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్ను శుక్ల ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని ఆ ప్రకటనలో సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్ను శుక్ల తెలియజేశారు.

## అక్రిడిటేషన్ లపై మంత్రుల బృందానికి సహాయంగా అధికారుల కమిటీ

రాష్ట్ర అక్రిడిటేషన్ నియమావళి అధ్యయనం కోసం ఏర్పాటుచేసిన మంత్రుల బృందానికి సహాయం చేసేందుకు ఐదుగురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తూ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. సమాచార శాఖ అదనపు డైరెక్టర్ స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్ పి కిరణ్ కుమార్, జాయింట్ డైరెక్టర్ సూర్యచంద్రరావు, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ మధుసూధన, సోషల్ మీడియా డిజిటల్ మీడియా చీఫ్ జనరల్ మేనేజర్ పి జయ రావు ఈ కమిటీలో ఉన్నారు.

# "క్షమించండి, అంకిత క్షమించండి"

అంకిత, మీ హత్యపై సిబిఐ దర్యాప్తు కోరుతూ సుప్రీంకోర్టులో మీ కేసు కొట్టివేయబడింది. మేము ఇంకా ప్రధాన నిందితుడిని పట్టుకోలేకపోయాము. నిర్భయమైన జర్నలిస్ట్, కోర్టు ముందు పిటిషనర్ అశుతోష్, ఈ కేసును దర్యాప్తు చేసినందుకు మీపై ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేసినందుకు మీ భార్య బదిలీ ద్వారా ఆమెను కూడా బలిపశువును చేయవలసి వచ్చినందుకు నేను క్షమించండి. హోటల్‌లో పనిచేస్తున్న యువతి అంకిత నుండి "ప్రత్యేక సేవలు" కోరిన ఒక విఐపి ద్వారా మీ ప్రియమైన కుమార్తె మరణించినందుకు సోనీ దేవి క్షమించండి. ఆమె తిరస్కరణ ఆమె హత్యకు దారితీసింది. ""మా పోలీసు దళం రాజకీయ నాయకుల ముందు చాలా నిటారుగా ఉండటం నాకు బాధగా ఉంది, వారు ఏదైనా నేరాన్ని కప్పిపుచ్చడానికి వీలు కల్పిస్తుంది. మొదటిది, అంకిత, ఆమె స్నేహితుడు పుష్పదీప్ మధ్య జరిగిన వాట్సాప్ చాట్‌లలో ఒక వీఐపీ తన హోటల్‌కు వస్తున్నాడని, ఆమె నుండి ప్రత్యేక సేవలు కావాలని ఆమె ఫిర్యాదు చేయడాన్ని ఉత్తరాఖండ్ పోలీసులు ఛార్జ్ షీట్ నుండి తొలగించారు. ఆ చాట్‌లలో ఆమె తన స్నేహితుడిని వెంటనే వచ్చి తనను బయటకు తీసుకెళ్లమని తీవ్రంగా కోరింది. రెండవది, పోలీసులు చూపించిన ఫోటో ఆధారంగా పుష్పదీప్ ఆ సహచరుడిని గుర్తించినప్పటికీ, ఆమె స్నేహితుడు పుష్పదీప్, వీఐపీ సహచరుడి మధ్య జరిగిన సంభాషణను ఛార్జ్ షీట్‌లో ప్రస్తావించలేదు. మూడవది, ఆ సహచరుడు తన బ్యాగ్‌లో నగదు, ఆయుధాలను తీసుకువెళుతున్నాడు. అయినప్పటికీ అతన్ని నిందితుడిగా చేయలేదు లేదా పోలీసులు ప్రశ్నించలేదు. నాల్గవది, అంకితను బలవంతంగా బయటకు తీసుకెళ్లి హత్య చేయడానికి ముందు ఆమె గదిలో ఏడుస్తోందని హోటల్ ఉద్యోగి అభినవ్ చేసిన ప్రకటనను ఛార్జ్ షీట్‌లో ప్రస్తావించలేదు. ఐదవది, అంకిత బస చేసిన గది శ్రీనగర్ లాబొరేటరీ ఫోరెన్సిక్ నివేదికను ఛార్జ్ షీట్‌లో ఎప్పుడూ జత చేయలేదు. ఆరవది, నేరస్థలం అంటే ఆమె బస చేసిన గదిని స్థానిక ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వెంటనే కూల్చివేశారు. ఏడవది, వీఐపీతో సంభాషణలో పాల్గొన్న హోటల్ సిబ్బంది మొబైల్ ఫోన్‌ను ఎప్పుడూ స్వాధీనం చేసుకోలేదు. ఎనిమిదవది, కెమెరాలు పనిచేయడం లేదనే అనుకూలమైన సాకుతో వీఐపీ అతని పరివారం గుర్తింపును స్పష్టంగా వెల్లడించే హోటల్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ను ఎప్పుడూ సమర్పించలేదు. తొమ్మిదవది, అంకిత మరణానికి ముందు కలత చెందిందని చెప్పిన సాక్షులను ఎప్పుడూ సరిగ్గా దర్యాప్తు చేయలేదు. పదవది, కాల్ డిటైల్ రికార్డ్‌ను దర్యాప్తు చేశామని, అందులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేవని ఉత్తరాఖండ్ పోలీసులు చేసిన ప్రకటన తప్పుదారి పట్టించేది ఎందుకంటే ఆ రికార్డ్ హోటల్ సిబ్బందికి సంబంధించినది కాదు, మరణించిన వ్యక్తి చాట్‌లకు సంబంధించినది. చివరగా, అంకిత నిందితులలో ఒకరితో మోటార్‌సైకిల్‌పై పిలియన్‌పై ప్రయాణిస్తున్నట్లు చూపించే వీడియోను ప్రాసిక్యూషన్ తప్పుగా ప్రస్తావించింది, ఆమె హత్యకు ముందు ఆమె మృతదేహాన్ని కాలువలో పడవేయడానికి ముందు ఆమె ఎటువంటి బాధను చూపించలేదని సూచిస్తుంది. అయితే, పుష్పదీప్ కోర్టుకు సమర్పించిన సాక్ష్యంలో, మోటార్‌సైకిల్‌పై కూర్చున్న అంకిత తనకు ఫోన్ చేసి, ఆమె చుట్టూ వ్యక్తులు ఉండటం వల్ల ఆమె చాలా భయపడిందని చెప్పిందని ఆయన అన్నారు. నిందితులైన హోటల్ సిబ్బంది ఇటీవల ట్రయల్ కోర్టును నార్కో విశ్లేషణకు ఆదేశించాలని కోరుతూ, ఈ సంఘటనల గురించి స్పష్టమైన వివరణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని సూచిస్తూ, ఇటీవల జరిగిన పరిణామాలను ట్రయల్ కోర్టు తిరస్కరించడంతో, విచారణ కోర్టు దరఖాస్తును తిరస్కరించింది. నిందితులు స్వయంగా ఇచ్చిన అలాంటి సాక్ష్యం విఐపి గుర్తింపు, పాత్రను వెలుగులోకి తెచ్చేది. ""విఐపి గుర్తింపును పోలీసులు కప్పిపుచ్చారు. దర్యాప్తును చేపట్టి తదుపరి దర్యాప్తు నిర్వహించాలని సిబిఐని ఆదేశించడం ద్వారా ఈ అడ్డంకిని అధిగమించవచ్చు. అతను ఒక ఉన్నత స్థాయి రాజకీయ కార్యకర్త అని, అతను తన పార్టీ సభ్యులతో పాటు తరచుగా హోటల్‌కు వచ్చేవాడని తల్లి అధికారులకు తెలియజేసింది. సిసిటివి ఫుటేజ్ లేదా సిబ్బంది మొబైల్ ఫోన్‌లను పొందడానికి తీసుకున్న ప్రాథమిక చర్యలు కూడా ప్రధాన నేరస్థుడి గుర్తింపును వెల్లడిస్తాయి. ""క్షమించండి అంకిత. ఇది భారతదేశం. సాధారణ మహిళల జీవితాలు లెక్కించబడవు. గొప్ప, శక్తివంతులు మళ్లీ మళ్లీ తప్పించుకుంటారు.

**కోలిన్ గోన్సాల్వేజ్**

సీనియర్ అడ్వకేట్ సుప్రీంకోర్టు

**(డెహ్రాడూన్‌లో బిజెపి నాయకుడి దగ్గరి బంధువు నడుపుతున్న హోటల్‌లో ఉద్యోగం చేస్తున్నప్పుడు హత్యకు గురైన యువతి అంకిత హత్యపై సిబిఐ విచారణ కోసం సుప్రీంకోర్టు పిటిషన్‌ను స్వీకరించడానికి నిరాకరించడంపై సుప్రీంకోర్టు న్యాయవాది కాలిన్ గోన్సాల్వేజ్ బహిరంగ లేఖ.)**

సర్క్యులర్ నెం. 57/2021/ప్రధానకార్యదర్శి దీ: 30-05-2025

రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులకు,

మిత్రమా!

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎ.పి.డబ్ల్యు.జె.ఎఫ్) కార్యవర్గ సమావేశం 2025 మే 29వ తేదీ విశాఖపట్నం ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని ప్లాటినం జూబిలీ హాలులో ఉదయం 11 గంటలకు జరిగింది. సమావేశానికి అధ్యక్షులు ఎస్.వెంకట్రావు అధ్యక్షత వహించారు. సమావేశానికి అతిథులుగా నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె) సెక్రటరీ జనరల్ ఎన్.కొండయ్య, జండర్ ఈక్విటీ కౌన్సిల్ కో చైర్‌పర్సన్ కె.మంజరి హాజరయ్యారు. సమావేశం తీరుతెన్నులను పరిశీలించిన సెక్రటరీ జనరల్ ఎన్.కొండయ్య ఫెడరేషన్‌కు మార్గనిర్దేశం చేస్తూ సంఘ నిర్మాణాన్ని పటిష్టం చేసుకునే క్రమంలో సైద్ధాంతికంగా బలోపేతం కావాల్సిన అవసరం ఉన్నదన్నారు. సమావేశ ఆరంభంలో గత సమావేశం నుంచి నేటి వరకు మరణించిన జర్నలిస్టులకు సంతాపం ప్రకటించి రెండు నిముషాలు మౌనం పాటించింది.

అనంతరం ప్రధానకార్యదర్శి కార్యకలాపాల నివేదికను, మార్చి, ఏప్రిల్ నెల జమాఖర్చుల వివరాలను తెలియజేశారు. ప్రధానకార్యదర్శి ప్రవేశపెట్టిన నివేదికపై జిల్లాల నుంచి విచ్చేసిన ప్రతినిధులు చర్చించారు. చర్చల్లో కె.వేణుగోపాల్ (శ్రీకాకుళం), కె.రమేష్‌నాయుడు (విజయనగరం), డి.రవికుమార్ (పార్వతీపురం), పి.నారాయణ్ (విశాఖపట్నం), బి.వెంకటేష్, బి.ఈశ్వరరావు (అనకాపల్లి), కె.జయరాజ్ (చిత్తూరు), అధికారి, మున్ని (కాకినాడ), హరీష్ (ఏలూరు), కె.నాగేంద్ర, బి.గోరంట్లప్ప (కర్నూలు), ఆర్.రామాంజనేయులు (అనంతపురం), రత్నాకర్ (గుంటూరు)లు పాల్గొన్నారు. సంఘం ఆర్థికంగా నిలదొక్కుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉన్నదని అందుకు అన్ని జిల్లా శాఖలు తమ తోడ్పాటును అందించాలని విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పి.నారాయణ్ ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనకు అన్ని జిల్లాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి.

గత కార్యవర్గ సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు త్వరలో ఫెడరేషన్ రాష్ట్ర కేంద్రానికి 50వేల రూపాయల మొత్తాన్ని అందజేస్తామని చిత్తూరు జిల్లా బాధ్యులు కె.జయరాజ్ తెలియజేశారు. కొత్త తరానికి బాధ్యతలు అప్పగించేందుకు ఫెడరేషన్ సిద్ధంకావాలని, సీనియర్లయినప్పటికీ పనిచేయని వారి విషయంలో తగు నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు.

జాతీయ కార్మిక సంఘాలు జూన్ 9వతేదీ తలపెట్టిన జాతీయ ఆందోళనకు మద్దతు నిచ్చి భాగస్వాములు కావాలని సమావేశం నిర్ణయించింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటై యేడాది పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదించేందుకు వీలుగా డిమాండ్స్‌ను విడిగా నిర్వహిస్తే బాగుంటుందని బి.గోరంట్లప్ప సూచనను సమావేశం అంగీకరించింది. ఫెడరేషన్ రాష్ట్ర మహాసభ నిర్వహించేందుకు వీలుగా అన్ని జిల్లాల్లో నియోజకవర్గ సమావేశాలు పూర్తిచేసుకుని జిల్లా మహాసభలను వీలయినంత త్వరగా నిర్వహించుకోవాలని సమావేశం నిర్ణయించింది. సమావేశం ముగింపులో కె.మంజరి మాట్లాడుతూ జిల్లా శాఖలు మరింత ఉత్సాహంగా పనిచేస్తే మంచి ఫలితాలను వస్తాయని తన అనుభవాలను వివరించారు. సమావేశం ప్రధానకార్యదర్శి నివేదిక, జమాఖర్చులను ఆమోదిస్తూ భవిష్యత్తు కార్యాచరణ రూపొందించే క్రమంలో సమావేశం దిగువ పేర్కొన్న నిర్ణయాలను ఆమోదించింది.

కార్యవర్గ నిర్ణయాలు:

1. ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ జూన్ 9న జాతీయ కార్మిక సంఘాలు నిర్వహించ తలపెట్టిన ఆందోళనకు ఫెడరేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాలు (వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1955, వేతనాల చెల్లింపు చట్టం 1958) కూడా రద్దుల జాబితాలో ఉన్నందున ఆందోళనలో భాగస్వాములై ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తోడ్పడాలని సమావేశం నిర్ణయించింది.

2. ప్రభుత్వం ఏర్పడి యేడాది కావస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జూన్ 11వతేదీ రాష్ట్ర మంతటా 'డిమాండ్స్ డే' నిర్వహించాలని కార్యవర్గం నిర్ణయించింది. ఈ సందర్భంగా మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రాలను అందజేయాలి. మండల కేంద్రం మొదలు రాష్ట్ర రాజధాని వరకు అన్ని చోట్ల ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని జిల్లా శాఖలకు కార్యవర్గం కోరింది.

3. అన్ని జిల్లా శాఖలు సంఘ నిర్మాణంపై దృష్టి సారించి సభ్యత్వ నమోదు, పునరుద్ధరణ, నియోజకవర్గ కమిటీల ఏర్పాటు, జిల్లాల మహాసభలను పరిపూర్తి చేసి రాష్ట్ర మహాసభకు సంసిద్ధం కావాలని సమావేశం కోరింది. మహాసభలు పూర్తి చేసుకున్న జిల్లా శాఖలు జూన్

5వ తేదీ నాటికి సభ్యత్వ జాబితాలను రుసుంతో సహా రాష్ట్ర కేంద్రానికి పంపాలి.

4. మహాసభలు నిర్వహించుకోవలసిన జిల్లాలు జూన్ నెలాఖరులోగా సభ్యత్వం, నియోజకవర్గ కమిటీల ఏర్పాటు తదితర అంశాలను పూర్తిచేసుకుని జిల్లా మహాసభలు పూర్తిచేయాలి. అందుకు గాను రాష్ట్ర కేంద్రం నుంచి జిల్లాల వారీగా బాధ్యతలు అప్పగిస్తూ కార్యవర్గం నిర్ణయించింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం జిల్లాల బాధ్యత ఆయా జిల్లాల బాధ్యుల తోడ్పాటుతో కె.వేణుగోపాల్, జి.శ్రీనుబాబు పూర్తిచేయాలి.

అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల బాధ్యత వి.నవీన్‌రాజ్ చూడాలి.

అనంతపురం, సత్యసాయి జిల్లాల బాధ్యత ఆర్.రామాంజనేయులు చూడాలి.

తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాల బాధ్యత కె.జయరాజ్ చూడాలి.

నంద్యాల, కర్నూలు జిల్లాల బాధ్యత బి.గోరంట్లప్ప చూడాలి.

రాష్ట్ర కేంద్రం నుంచి బాపట్ల, పల్నాడు, కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాల బాధ్యత చూడాలి.

ఆయా జిల్లాల బాధ్యులు తమ సంపూర్ణ సహకారం అందించి జిల్లాల మహాసభలు అనుకున్న సమయంలో జూన్ నెలాఖరు నాటికి పూర్తయ్యేందుకు తోడ్పడాలి.

5. విశాఖపట్నంలో రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నందుకు మహాసభ ఏర్పాట్లు చూసేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులతో సమన్వయం చేసుకుని సన్నాహక కమిటీ జి.శ్రీనుబాబు నేతృత్వంలో కొనసాగాలని కార్యవర్గం నిర్ణయించింది.

6. సంఘ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని అన్ని జిల్లా శాఖలు తమ సహకారాన్ని అందించాలి. అందుకుగాను ప్రతి జిల్లా 25 వేల రూపాయలు రాష్ట్ర కేంద్రానికి పంపాలని కార్యవర్గం నిర్ణయించింది.

7. ఫెడరేషన్ రాష్ట్ర మహాసభ దృష్ట్యా రాష్ట్ర ఎన్నికల అధికారిగా సీనియర్ జర్నలిస్టు జి.గద్దెన్నను నియమిస్తూ కార్యవర్గం నిర్ణయించింది. ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్, నేషనల్ కౌన్సిల్ సభ్యుల ఎన్నిక, ఫెడరేషన్ ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతను ఆయనకు అప్పగిస్తూ సమావేశం నిర్ణయించింది. ఆయన ఎన్నికల నిర్వహణ చేసేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు తోడ్పాటు కార్యవర్గం అందించాలని నిర్ణయించింది.

8. ఫెడరేషన్ బిజినెస్ రూల్స్‌లో సంఘానికి గౌరవ అధ్యక్ష పదవిని కల్పిస్తూ కార్యవర్గం మిగిలిన బిజినెస్ రూల్స్‌ను యధాతథంగా అమోదం తెలియజేసింది.

9. జిల్లాల మహాసభలు పూర్తయిన అనంతరం విశాఖపట్నం జిల్లా కమిటీతో సంప్రదించి రాష్ట్ర మహాసభల తేదీల ఖరారు బాధ్యతను ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులకు అప్పగిస్తూ సమావేశం తీర్మానించింది.

10. రాష్ట్ర మహాసభల సందర్భంగా వర్కింగ్ జర్నలిస్టు ప్రత్యేక సంచికను తీసుకురావాలని, అందుకు అన్ని జిల్లా శాఖలు తమ తోడ్పాటును అందించాలని సమావేశం నిర్ణయించింది.

ఫెడరేషన్ రాష్ట్రకౌన్సిల్, నేషనల్ కౌన్సిల్ ఎన్నికల నిర్వహణకు వీలుగా సభ్యత్వ జాబితాలను నిర్ణయించిన తేదీల కంటే ముందుగా సిద్ధమైతే ఆయా జిల్లాలు వెంటనే పంపాలని సమావేశం సూచించింది.

జర్నలిస్టుల చట్టాల రద్దును నిరసిస్తూ జూన్ 9న జరిగే ఆందోళన, జర్నలిస్టుల సమస్యలపై జూన్ 11న జరిగే డిమాండ్స్ డేను విజయవంతం చేసేందుకు అన్ని జిల్లా శాఖలు వెంటనే తమ కార్యవర్గ సమావేశాలు నిర్వహించి కార్యక్రమాన్ని రూపొందించుకోవాలని కార్యవర్గం కోరింది.

జిల్లాల మహాసభలు పూర్తిచేసుకుని ఫెడరేషన్ రాష్ట్ర మహాసభకు సంసిద్ధం కావాలిన అన్ని జిల్లా శాఖలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

అభివందనాలతో



(జి.ఆంజనేయులు)


ప్రధానకార్యదర్శి

# సీనియర్ జర్నలిస్ట్ రామకృష్ణ మృతి



సీనియర్ జర్నలిస్ట్ జాగర్లమూడి రామకృష్ణ (68) అనారోగ్యంతో మే 31వ తేదీ హైదరాబాదులో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన నాలుగున్నర దశాబ్దాలుగా తెలుగు పత్రిక రంగంలో రాణించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఆయన పనిచేశారు. కొంత కాలం పాటు మద్రాసులో సినిమా జర్నలిస్టుగా కూడా ఆయన పనిచేశారు. ఈనాడు, ఆంధ్రభూమి, జెమినీ టీవీ తదితర ప్రముఖ మీడియా సంస్థలలో పనిచేశారు. ఇటీవల మెదడుకు శస్త్ర చికిత్స చేయించుకున్న రామకృష్ణ కోలుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న క్రమంలో ఆయన మృతి వార్త పలువురు మిత్రులను కలిసివేసింది. రామకృష్ణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తె తెలుగు, తమిళం టీవీ సీరియల్స్ లో ఆర్టిస్టుగా నటిస్తున్నారు. మరొక కుమార్తె విదేశాలలో ఉంటున్నారు. జాగర్లమూడి రామకృష్ణ మృతి పట్ల సీనియర్ జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్లు తమ సంతాపం తెలియజేశాయి.

# ఫిల్మ్ జర్నలిస్టు బి కె ఈశ్వర్ మృతి



అయిదు దశాబ్దాలుగా ఫిల్మ్ జర్నలిస్టుగా తెలుగు చిత్ర పరిశ్రమలో ఉంటూ వివాదరహితుడైన బి.కె ఈశ్వర్ (76) మే 16వ తేదీ రాత్రి అనారోగ్యంతో మరణించారు. ఆయన పూర్తి పేరు భైరపి కోటేశ్వరరావు. విజయ్ చిత్ర మాసపత్రికలో చాలాకాలం పని చేశారు. చెన్నై హైదరాబాద్ లో పని చేసిన ఈశ్వర్ హైదరాబాదులో సివిఆర్ న్యూస్ లో కొంతకాలం పనిచేశారు. జర్నలిస్టుగా తన అనుభవాలను బికే ఈశ్వర్ ఆంధ్రజ్యోతి సంస్థకు చెందిన నవ్య వార పత్రికలో 62 వారాలపాటు "అనగా అనగా ఒకసారి" పేరుతో వ్యాసాలు రాశారు. జర్నలిజానికి మాత్రమే పరిమితం కాకుండా ఈశ్వర్ పలు సినిమాలకు మాటలు పాటలు కూడా రాశారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్, నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ తెలంగాణ శాఖ సంతాపం తెలియజేసి వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశాయి.

# యువ జర్నలిస్టు రాజేష్ మృతి



యువ జర్నలిస్టు బొల్లోజు రాజేష్ (బిట్టు) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. అనారోగ్యానికి గురయిన రాజేష్‌ను ఆయన స్నేహితులు ఎస్ఆర్ నగర్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ రెండు రోజులు చికిత్స పొందిన అనంతరం నిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి రాజేష్ మృతి చెందాడు. ఆంధ్రప్రభ పత్రికలో డిజైనర్‌గా కెరీర్ ప్రారంభించిన రాజేష్ అనంతరం మన తెలంగాణ, ఆంధ్రజ్యోతి, మనం, వెలుగు, బిగ్ టీవీ స్వేచ్ఛ తదితర మీడియా సంస్థల్లో సీనియర్ డిజైనర్‌గా కొనసాగారు. రాజేష్ స్వస్థలం నల్గొండ జిల్లా మిర్యాలగూడ కాగా చిన్నప్పటి నుంచే కుటుంబంతో హైదరాబాద్‌లో ఉంటున్నారు. రాజేష్ మృతి పట్ల ఎన్ఎజె తెలంగాణ శాఖ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ సంతాపం తెలియజేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బెస్ట్ డిజైనర్‌గా అనేక మీడియా సంస్థల్లో పని చేసిన రాజేష్ చిన్న వయసులోనే మరణించడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు.

# ఐఎఫ్‌డబ్ల్యుజె అధ్యక్షులు విక్రమరావు కన్నుమూత



సుదీర్ఘకాలం జర్నలిస్టు ఉద్యమంలో  పనిచేస్తూ ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షులుగా ఉన్న కోటంరాజు విక్రమరావు (82) లక్నోలో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విక్రమ రావు మరణం పట్ల నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్ ( ఎన్ఏజే) అధ్యక్షులు ఎస్.కె.పా,డే సెక్రటరీ జనరల్ ఎన్.కొండయ్య, కోశాధికారి ఎ.అమరయ్య, జండర్ ఈక్విటీ కౌన్సిల్ కో చైర్‌పర్సన్ కె.మంజరి, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( ఏపీడబ్ల్యూజేఎఫ్) అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్కాస్ జర్నలిస్ట్ అసోసియేషన్ ( ఏపీ బీజేఏ) కన్వీనర్లు వి.శ్రీనివాసరావు, కె.మునిరాజు, ఎన్ఏజే తెలంగాణ యూనిట్ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్‌లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశాయి. ఐదు దశాబ్దాలుగా జర్నలిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విక్రమరావు జర్నలిస్టుల వేజ్ బోర్డులో, ప్రెస్ కౌన్సిల్ లో సభ్యులుగా పనిచేశారు.

# ఉక్రెయిన్ జర్నలిస్టు విక్టోరియా హతం



కిడ్నాప్‌కు గురైన డేరింగ్ డాషింగ్ యువ జర్నలిస్ట్ విక్టోరియా భౌతికకాయం బ్యాగ్‌లో తిరిగి ఉక్రెయిన్‌కు పంపించాయి రష్యా బలగాలు. కానీ, ఆమె కళ్ళు, మెదడు, స్వర పేటిక లేవని డైలీ మెయిల్ పత్రిక వెల్లడించింది! ఇది దురదృష్టకరం, చాలా విచారకరం. ప్రపంచ వ్యాప్తంగా జర్నలిస్టులకు బ్లాక్ డే. ఉక్రెయిన్ యుద్ధాన్ని, అక్కడి రష్యన్ బలగాల ఘోరాన్ని ఎప్పటికప్పుడు సాహసోపేతంగా ప్రపంచానికి తెలియచేసిన జర్నలిస్ట్ విక్టోరియా రోస్చినాను రష్యన్ సైనికులు కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే! ఆమె భౌతిక కాయాన్ని బ్యాగులో కుక్కి ఉక్రెయిన్‌కు పంపించారు. రష్యా జైలులో ఆమెను దారుణంగా చిత్రహింసకు గురి చేసినట్లు ఆమె భౌతికకాయాన్ని చూస్తే అర్ధమవుతున్నదని ఉక్రెయిన్ సైనికాధికారి వివరించారు. రష్యన్ దళాల దారుణ హింస బయటకు రాకుండా ఉండేందుకు ఆమె మెదడు, కళ్ళు తొలగించి ఉండొచ్చని కీవ్ లోని అధికారులు ప్రకటించారు. మానవ హక్కుల ఉల్లంఘనలను దాచేందుకు పరిమితులకు మించి హింసించిన ఖైదీల శరీర భాగాలను తొలగించడం రష్యాలో ఉన్న ఒక సర్వ సాధారణ విషయం. ఉజ్వల భవిష్యత్ వున్న జర్నలిస్ట్ విక్టోరియా 27 ఏళ్లకే ఇలా దారుణ హింసకు గురై చివరకు ప్రాణాలు కోల్పోయి బాడీ బ్యాగ్ లో వెనక్కి రావడం ఘోరమైన చర్య. ఇప్పటికే ఉత్తమ జర్నలిస్టుగా అంతర్జాతీయ అవార్డులు అందుకున్న ధైర్యమైన ధీర విక్టోరియాకు జోహార్లు, నివాళి.



విశాఖపట్నంలో మే 28న జరిగిన ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు



వ్యవసాయంపై విశ్లేషణాత్మక కథనాలు ప్రసారం చేసిన ఈటీవీ సీనియర్ చీఫ్ రిపోర్టర్ లక్ష్మీప్రసాద్ అవార్డు అందుకున్న సందర్భంలో అనంతపురం జిల్లా ఫెడరేషన్ సత్కరించిన దృశ్యం




ఒంగోలులో జరిగిన ఫెడరేషన్ జిల్లా మహాసభ దృశ్యం